- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

గురువారం
2-07-2026

సంపుటి : 01 సంచిక :101 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE101 NAMASTEY MAHAAPRABHA



### రెండో విడత రైతు భరోసా
## నిధులు విడుదల

- 10.68 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.1590.02 కోట్లు జమ
- మూడెకరాలు ఉన్న రైతులకు లబ్ధి

హైదరాబాద్
వానాకాలం రైతు భరోసా రెండో విడత నిధులనూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. రెండు ఎకరాల నుంచి మూడెకరాల వరకు భూమి కలిగి ఉన్న 10.68 లక్షల రైతుల ఖాతాల్లో రాష్ట్ర సర్కారు రూ.1,590.02 కోట్లు జమ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మొదటి విడతలో రూ.2,482 కోట్ల నిధులు విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండ్రోజుల వ్యవధిలో 32 జిల్లాలకు చెందిన 54,95,742 మంది రైతుల ఖాతాలో మొత్తంగా రూ.4072.04 కోట్లు జమ చేసినట్టు అయ్యింది. అత్యధికంగా నల్లగొండ జిల్లాకు చెందిన 4,06,875 మంది

-మిగతా 3 లో

# చర్చకు సిద్ధమే..




### దమ్ముంటే తేదీ, స్థలం, సమయం చెప్పు

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ప్రతిసవాల్
- ప్రభుత్వ వైఫల్యాలు నిరూపించకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- అబద్ధాలు ఆపి ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు
- రాష్ట్రం దివాలా తీసింది సీఎం వల్లే
- రైతాంగానికి రూ.1.13 లక్షల కోట్లు ఎగ్గొట్టారు: కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్ జూలై 1 (మహా ప్రభ)
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వైఫల్యాలు, రైతన్నల దుస్థితి, వ్యవసాయ సంక్షోభం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వంటి ఏ అంశంపైనైనా ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. దమ్ముంటే తేదీ, స్థలం, సమయం చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ప్రతిసవాల్ విసిరారు. వరంగల్, హైదరాబాద్‌లో అసెంబ్లీ, బోధి పెవిలియన్, ప్రెస్‌క్లబ్, అశోక్‌నగర్ చౌరస్తా ఎక్కడికైనా తానే స్వయంగా వస్తానని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనపైనా, రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గణాంకాలతో సహా నిరూపించడంలో తాను విఫలమైతే అక్కడికక్కడే రాజీనామా చేసి రాజకీయాల

-మిగతా 3 లో




### యాదగిరిగుట్టకు నూతన
## పాలకమండలి ఏర్పాటు

- చైర్మన్‌గా ఎంఎస్ఎన్ గ్రూప్ సీఎండీ మన్నె సత్యనారాయణ రెడ్డి నియామకం
- బోర్డు సభ్యురాలిగా చిరంజీవి అర్ధాంగి సురేఖ కొణిదెల
- టీటీడీ తరహాలో 18 మందితో కమిటీ..రెండేళ్ల పదవీకాలం

హైదరాబాద్ జూలై 1 (మహా ప్రభ)
తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి (వైటీడీ) రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలక మండలిని ఏర్పాటు చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో మొత్తం 18 మంది సభ్యులతో ఈ కమిటీని నియమించింది. బోర్డు చైర్మన్‌గా ప్రముఖ ఔషధ రంగ పారిశ్రామికవేత్త, ఎంఎస్ఎన్ గ్రూప్ వ్యవస్థాపక సీఎండీ డాక్టర్ మన్నె సత్యనారాయణ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పాలక మండలిలో సభ్యులుగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, ప్రముఖ నటుడు చిరంజీవి అర్ధాంగి కొణిదెల సురేఖకు చోటు కల్పించారు. వారితో పాటు చిలపుగారి విజయరాజం, తూళ్ల విజయేందర్, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కాంతమణి, ఎం.రాఘవేంద్ర రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్

-మిగతా 3 లో



3

### ప్రపంచ డిజిటల్ చెల్లింపుల్లో
## యూపీఐ అగ్రస్థానం

- 103 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు
- రోజుకు 66 కోట్ల యూపీ ఐ లావాదేవీలు
- 11 ఏళ్ల డిజిటల్ ఇండియాపై ప్రధాని ప్రశంసలు
- సాంకేతికతతో ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ప్రధాని వ్యాఖ్య

దేశ డిజిటల్ విప్లవానికి ప్రతీకగా నిలిచిన డిజిటల్ ఇండియా కార్యక్రమం 11 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రస్తుతం దేశంలో 103 కోట్లకు పైగా ఇంటర్నెట్ కనెక్షన్లు, రోజుకు 66 కోట్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయని వెల్లడించారు. సాంకేతికతను ప్రతి పౌరుడికి చేరువ చేస్తూ, డిజిటల్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ రంగాల్లో భారత్‌ను ప్రపంచానికి ఆదర్శంగా నిలిపిన డిజిటల్ ఇండియా దేశ అభివృద్ధికి కీలక శక్తిగా మారిందని ఆయన పేర్కొన్నారు.



## శెభాష్..లోకేష్

- విద్యా శాఖ మంత్రిగా లోకేష్ పనితీరుకు రాష్ట్రపతి ప్రశంసలు
- విద్యాశాఖలో సంస్కరణలు కొనసాగించాలని సూచన
- యువతలో స్ఫూర్తి నింపేలా లోకేష్ ప్రసంగించారని అభినందించిన రాష్ట్రపతి

అమరావతి జూలై 1 (మహా ప్రభ)
విద్యాశాఖ మంత్రిగా దేశానికే ఆదర్శంగా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం కృషి చేస్తూ, ఎన్నో సంస్కరణలు విజయవంతంగా అమలు చేస్తున్న నారా లోకేష్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. ఈ సంస్కరణలు కొనసాగాలని సూచించారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్శిటీ తొలి స్నాతకోత్సవానికి హాజరై తిరిగి వెళుతున్నప్పుడు రాష్ట్రపతికి వీడ్కోలు పలికేందుకు హెలికాప్టర్ వరకు మంత్రి లోకేష్ వెళ్లారు. తన దగ్గరకు మంత్రిని పిలిచిన రాష్ట్రపతి.. ఏపీలో విద్యాసంస్కరణలు, విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన మార్పులు చాలా బాగున్నాయని అభినందించారు. వీటిని కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు కేంద్రంగా సాగుతున్న విద్యా వ్యవస్థ మార్పులు వారికి బంగారు భవిష్యత్తుకు మార్గం

-మిగతా 3 లో

# ఆదాయం పెంచండి

### ఆదాయ సమీకరణపై సీరియస్‌గా దృష్టి సారించాలి

- ఏఐతో అనుసంధానం, ఆ శాఖల్లో లీకులు లేకుండా చూడండి
- ఛేజింగ్ సెల్ ఏర్పాటు చేసుకుని నిరంతరం ఫాలో అప్ చేయాలి
- భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలి
- ఊహాజనిత బడ్జెట్ కాదు... వాస్తవికత ఆధారగానే బడ్జెట్‌ను రూపొందించాలి
- ఆదాయ సమీకరణపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి జూలై 1 (మహా ప్రభ)
రాష్ట్ర ఆదాయ సమీకరణపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలంటే ఆదాయం పెరగాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర బడ్జెట్ లక్ష్యాలను విజయవంతంగా సాధించాలంటే ఆదాయ సమీకరణపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదాయ పెంపుదల, నిధుల సమీకరణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన క్యాంపు ఆఫీసులో ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు.

-మిగతా 3 లో






### రాగల 4 రోజులు భారీ
## వర్ష సూచన!

- రాష్ట్రంలోని అన్నదాతలకు ఊరట
- గంటకు 50 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం
- తెలంగాణ వాతావరణ శాఖ

హైదరాబాద్ జూలై 1 (మహా ప్రభ)
రాష్ట్రవ్యాప్తంగా రాగల నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గాలివేగం గంటకు 40 నుండి 50 కి.మీ. వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. దక్షిణ మధ్య మధ్యప్రదేశ్ నుండి తూర్పు మధ్య అరేబియా సముద్రం వరకు సముద్ర మట్టానికి 4.5 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రస్తుతం బలహీనపడిన కారణంగా వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారీ వర్షాలు రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల,

-మిగతా 3 లో



3 లో

### భారత్-పాక్ సంబంధాలు
## పునరుద్ధరించండి..

- మోదీ, షెహబాజ్ షరీఫ్‌కు 117 మంది ప్రముఖుల బహిరంగ లేఖ
- భారత్--పాక్ సంబంధాల పునరుద్ధరణకు విజ్ఞప్తి
- వీసాలు, విమానాలు, వాణిజ్య సేవలు పునఃప్రారంభించాలని సూచన
- అట్టారి--వాఘా సరిహద్దు తెరవాలని ప్రతిపాదన
- వైరం వల్ల యువత, ఆర్థిక వ్యవస్థకు నష్టమని ఆందోళన

## అమెరికాతో చర్చలకు ఇరాన్ సిద్ధం



- విఫలమైతే యుద్ధానికీ వెనుకాడబోమన్న హెచ్చరిక
- అణు హక్కుల విషయంలో రాజీ లేదన్న తేహ్రాన్
- దోహాలో కీలక మధ్యవర్తిత్వ చర్చలు
- ఆంక్షల ఎత్తివేత, ఒప్పందంపైనే ఇరాన్ పట్టుదల
- అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్

3

## పాకిస్థాన్‌పై తాలిబన్ ప్రతీకార దాడులు..



- డ్రోన్‌లతో విరుచుకుపడ్డ ఆఫ్ఘన్ సైన్యం
- ఐఎస్-కే స్థావరాలే లక్ష్యమన్న తాలిబన్
- సరిహద్దులో ఉద్రిక్తతలు మరింత తీవ్రం
- పాక్ వైమానిక దాడులకు ప్రతీకార చర్యలు
- పౌరుల మృతులపై పరస్పర ఆరోపణలు

3

# పిల్లలను వాషింగ్ మెషీన్‌లో పెట్టి చిత్రహింసలు



**న్యూఢీల్లి జూలై 1 (మహా ప్రభ)**
బెంగళూరులోని ఓ ఐటీ క్యాంపస్‌లో ఉన్న డేకేర్ సెంటర్‌లో పిల్లలను శారీరకంగా హింసించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఐదుగురు మహిళా సంరక్షకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇక్కడ ఉన్న రెండు నుంచి మూడేళ్ల వయసున్న పిల్లలు ఏడ్చినా, అల్లరి చేసినా.. ఆయాలు వారిని బెదిరిస్తున్నట్లు ఆ వీడియోల్లో కనిపిస్తోంది. మరోవైపు పిల్లలను ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లో పెట్టడం, వెస్ట్రన్ టాయిలెట్‌పై కూర్చోబెట్టడం, టాయిలెట్ జెట్ స్ప్రే ఉపయోగించి నోటిలోకి నీళ్లు చల్లడం, బాత్‌రూమ్‌ల్లో బంధించడం వంటివి చేశారని ఆరోపణలు ఉన్నాయి.

# టీఎంసీ మహిళా ఎంపీపై కోడిగుడ్లతో దాడి



**న్యూఢీల్లి జూలై 1 (మహా ప్రభ)**
పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత... ఆ రాష్ట్రంలో రాజకీయ హింస తీవ్రరూపం దాల్చింది. ప్రతిపక్ష టీఎంసీ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా టీఎంసీ మహిళా ఎంపీ మహువా మొయిత్రాపై దాడి జరిగింది. పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ఓ దుకాణం వద్ద ఆమెపై కొందరు కోడిగుడ్లు విసిరారు. ఈ ఘటనను మహువా స్వయంగా ధృవీకరించారు. బీజేపీ కార్యకర్తలు ఈ దాడికి పాల్పడినట్లు మహువా ఆరోపించారు. రాష్ట్ర పోలీసుల వైఫల్యమే ఇలాంటి ఘటనలకు కారణమని ఆమె విమర్శించారు.

# ఆగష్టు 30న నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్ష.


**-దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం.. కీలక డేట్స్ ఇవే**




**న్యూఢీల్లి జూలై 1 (మహా ప్రభ)**
మెడికల్ విద్యార్థులకు 2026లో పీజీలో అడ్మిషన్ల కోసం నిర్వహించే నీట్ పీజీ ప్రవేశ పరీక్ష తేదీ వచ్చేసింది. ఆగష్టు 30న నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్ష జరగనుంది. ఇందుకోసం దరఖాస్తుల ప్రక్రియ జూలై 1 సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రారంభమైంది. దరఖాస్తులు సమర్పించేందుకు చివరి తేదీ జూలై 21, రాత్రి 11.55 గంటలు. ఈ పరీక్షను ఎన్‌బీఈఎంఎస్ (నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్) సంస్థ నిర్వహిస్తుంది. ఇటీవల నీట్ యూజీ పేపర్ లీక్ నేపథ్యంలో పీజీలో ప్రవేశం కోసం అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.కాపీయింగ్ జరగకుండా చాలా రూల్స్ అమలు చేయనుంది ఎన్‌బీఈఎంఎస్. టెస్ట్ సిటీ కేటాయింపు రూల్స్ మార్చేశారు. అంటే ముందుగా దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన కోరుకున్న సిటీలో ప్రవేశపరీక్ష రాసే అవకాశం ఉండదు. ఫస్ట్ కమ్.. ఫస్ట్ సర్వ్‌డ్ బేసిస్ విధానం ఉండదు. అభ్యర్థులు పరీక్ష రాసేందుకు తప్పనిసరిగా మూడు రాష్ట్రాలను, అక్కడి సిటీలను ఎన్నుకోవాల్సి ఉంటుంది. వాటిలోంచే పరీక్ష రాసే సిటీలను కేటాయిస్తారు. ఆధార్ అథెంటికేషన్, బయోమెట్రిక్ రూల్స్‌ను తప్పనిసరి చేయనున్నారు. దీనికోసం విద్యార్థులు పరీక్ష రాసే సమయానికి చేతికి, వేళ్లకు హెన్నా, రంగులు వంటివి రాసుకుని ఉండకూడదు. ఇతరులతో అప్లికేషన్ వివరాలు పంచుకోకూడదు.అభ్యర్థులకు ఆగష్టు 11 నుంచి అడ్వాన్స్‌గా ఎగ్జామినేషన్ సిటీకి సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. ఆగష్టు 30న ప్రవేశ పరీక్ష జరిగితే, సెప్టెంబర్ 30లోపు ఫలితాలు వెల్లడవుతాయి. దరఖాస్తు సందర్భంగా పరీక్షుక సంబంధించిన నియమ నిబంధనల్ని అభ్యర్థులు తప్పనసరిగా చదవాలని ఎన్‌బీఈఎంఎస్ సూచించింది. పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

# పడకేసిన తయారీ రంగం

**-మూడు నెలల కనిష్టానికి పీఎంఐ**



**న్యూఢిల్లీ జూలై 1 (మహా ప్రభ)**
అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, దేశీయంగా నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా భారత తయారీ రంగం మందగించింది. ఈ ఏడాది జూన్‌లో తయారీ రంగం వృద్ధి తగ్గిందని ఎస్ అండ్ పి గ్లోబల్ నిర్వహించిన హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) వెల్లడించింది. జూన్ నెలలో పీఎంఐ 54.2 పాయింట్లకు పరిమితమయ్యిందని పేర్కొంది. మే నెలలో 55 పాయింట్లుగా ఉన్న ఈ సూచీ.. గత మూడు నెలలతో పోలిస్తే ఇదే అత్యల్ప స్థాయి అని సర్వే వెల్లడించింది. తయారీ రంగంలో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి, ఎగుమతులు, నియామకాల వేగం తగ్గడం ఈ పతనానికి ప్రధాన కారణాలని విశ్లేషించింది. పీఎంఐ సూచీ 50 పాయింట్ల కంటే పైన కొనసాగితే కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ ఇటీవల ఈ సూచీ పడిపోవడం ఆందోళకరం. గతేడాది మార్చి తర్వాత ఎగుమతులు అత్యంత బలహీనమైన వృద్ధిని నమోదు చేశాయి.

# పదమూడేళ్ల బాలికపై 30మంది సామూహిక అత్యాచారం..

**నిందితులకు చెందిన నాలుగు హోటళ్లు కూల్చివేత**

**న్యూఢీల్లి జూలై 1 (మహా ప్రభ)**
రాజస్థాన్‌లో దారుణం జరిగింది. పదమూడేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. దాదాపు 30 మంది వరకు అత్యాచారం, లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నిందితులకు సంబంధించిన నాలుగు హోటళ్లను అధికారులు కూల్చేశారు. రాజస్థాన్‌లోని, శ్రీగంగానగర్‌కు చెందిన పదమూడేళ్ల బాలిక జూన్ 18న కిడ్నాప్‌నకు గురైంది. బాలికను స్తానిక రిక్షా కార్మికుడు ఎత్తుకెళ్లి ఒక హోటల్ నిర్వాహకుడికి ఇచ్చేశాడు.ఆ హోటల్ ఓనర్ బాలికపై హోటల్‌లో అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఇతర హోటళ్లకు కూడా బాలికను తీసుకెళ్లాడు. అలా,




నాలుగు హోటళ్లలో చిన్నారిపై అత్యాచారం, లైంగికదాడి జరిగింది. దాదాపు ఐదు రోజులపాటు బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. వివిధ హోటళ్లలో మొత్తం 30 మంది వరకు ఈ దారుణానికి ఒడిగట్టారు. దీంతో బాలిక నొప్పితో ఇబ్బంది పడుతూ, ఏడుస్తుంటే తనకు ఆల్కహాల్ తాగించి, మరీ లైంగిక దాడి చేశారు. ఈ దాడిలో నాలుగు లేదా అంతకుమించి హోటల్స్ ఓనర్స్ ప్రధాన పాత్ర పోషించారు. అంతేకాకుండా ఈ లైంగికదాడిని దాచిపెట్టే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. నలుగురు ప్రధాన నిందితులకు సంబంధించిన నాలుగు హోటళ్లను బుధవారం బుల్డోజర్లతో కూల్చేశారు. ఈ ఘటనలో ఇప్పటివరకు మొత్తం 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మిగతావారి కోసం గాలిస్న్?న్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హరిశంకర్ తెలిపారు. ఈ అత్యాచారంపై స్థానికుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారీ ఎత్తున నిరసనలు చేస్తున్నారు.

# హిందూ వివాహాలపై గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**సప్తపది లేని పెళ్లి పెళ్లే కాదు..**

**న్యూఢీల్లి జూలై 1 (మహా ప్రభ)**
హిందూ వివాహ వ్యవస్థ విశిష్టతను చాటిచెబుతూ గుజరాత్ హైకోర్టు ఒక చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. హిందూ సంప్రదాయాల ప్రకారం 'సప్తపది' (ఏడడుగులు) వంటి శాస్త్రోక్తమైన క్రతువులు నిర్వహించకుండా కేవలం మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందినంత మాత్రాన ఆ పెళ్లి చట్టబద్ధంగా చెల్లుబాటు కాదని హైకోర్టు స్పష్టంచేసింది. హిందూ వివాహం అనేది కేవలం 'పాటలు, డ్యాన్స్‌లు, విందు వినోదాల' కోసం జరుపుకునే వేడుక కాదని వ్యాఖ్యానించింది. వధూవరులు పవిత్రమైన అగ్ని



సాక్షిగా ఏడడుగులు వేయడమే వివాహానికి ఆధ్యాత్మిక, సామాజిక, చట్టపరమైన హోదాను కల్పిస్తుందని జస్టిస్ ఇలేష్ వోరా, జస్టిస్ ఆర్‌టీ వాచ్ఛానిల బెంచ్ తేల్చిచెప్పింది.యూకేలో నివసిస్తున్న కౌశల్ సోనార్ అనే వ్యక్తి అప్పీల్‌పై విచారణ జరుపుతూ కోర్టు ఈ తీర్పునిచ్చింది. అహ్మదాబాద్‌కు చెందిన ఒక మహిళ తన సంతకాలను మోసపూరితంగా సేకరించి మ్యారేజ్ సర్టిఫికేట్ పొందిందని, తమ మధ్య ఎలాంటి సంప్రదాయ వివాహ క్రతువులు జరగలేదని కౌశల్ కోర్టును ఆశ్రయించాడు. గతంలో ఫ్యామిలీ కోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. దాంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో సదరు మహిళ కూడా తమ మధ్య ఎలాంటి పెళ్లి ఆచారాలు జరగలేదని అంగీకరించింది. దాంతో హిందూ వివాహ చట్టం ప్రకారం సప్తపది లేని వివాహం అసలు పెళ్లే కాదని హైకోర్టు స్పష్టంచేసింది. గతంలో ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ.. సప్తపది లేని పెళ్లి చెల్లదని తీర్పునిచ్చింది.

# వెనిజులాలో భారత నావికుడు మృతి..

**మృతదేహంలో మెదడు, గుండె, ఇతర అవయవాలు మాయం**

**లక్నో:న్యూఢీల్లి జూలై 1 (మహా ప్రభ)**
భారతీయ నావికుడు వెనిజులాలో పని చేస్తూ కార్గో షిప్‌లో మరణించాడు. నెల తర్వాత అతడి మృతదేహం భారత్‌కు చేరుకున్నది. పోస్ట్‌మార్టం నిర్వహించగా మెదడు, గుండె, ఊపిరితిత్తులు వంటి అంతర్గత అవయవాలు మాయమైనట్లు తేలింది. ఇది తెలుసుకుని అతడి కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. ఉత్తరప్రశేలోని డియోరియా జిల్లాకు చెందిన 33 ఏళ్ల రాకేష్ చౌహాన్ తన భార్య, ఆరు నెలల కుమారుడు, తండ్రి, సోదరుడితో కలిసి ముంబై నివసించాడు.కాగా, 2025 నవంబర్‌లో మర్చంట్ నేవీలో చేరిన రాకేష్ చౌహాన్, వెనిజులాలో మెరైన్ ఫిట్టర్‌గా పనిచేశాడు. ఈ ఏడాది మే 7న రాకేష్ ప్రమావశాత్తు నౌక డెక్‌పై పడి తీవ్రంగా గాయపడినట్లు అతడు పనిచేస్తున్న కంపెనీ నుంచి తండ్రికి ఫోన్ వచ్చింది. మరునాడు అతడి పరిస్థితి విషమంగా ఉన్నదని సమాచారం ఇచ్చారు. ఆ రోజు సాయంత్రం రాకేష్ చికిత్స పొందుతూ గుండెపోటుతో మరణించినట్లు ఆ కంపెనీ తెలియజేసింది. మరోవైపు సుమారు నెల రోజుల తర్వాత రాకేష్ మృతదేహం భారత్‌కు చేరుకున్నది.



పరీక్షించిన వైద్య బృందం విదేశంలోనే పోస్ట్‌మార్టం జరిగినట్లు పేర్కొంది. తిరిగి పోస్ట్‌మార్టం నిర్వహించలేమని వైద్య బృందం తెలిపింది. అయితే ఈ విషయాన్ని కంపెనీ తమకు తెలియజేయలేదని అతడి కుటుంబం ఆందోళన వ్యక్తం చేసింది. కాగా, డియోరియా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రాకేష్ మృతదేహానికి రెండోసారి పోస్ట్‌మార్టం నిర్వహించారు. అయితే శరీరం లోపల అంతర్గత అవయవాలేవీ లేవని వైద్యులు గుర్తించారు. మెదడు, గుండె, ప్లీహం, కాలేయం, క్లోమం, పిత్తాశయం, రెండు మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, పేగులు, కరోనరీ ధమనులు, మూత్రాశయం, ఇతర అవయవాలు కూడా లేవని వెల్లడైంది. అంతేకాకుండా రాకేష్ శరీరంపై మెడ నుంచి మర్మాంగం వరకు, ఎడమ చెవి నుంచి కుడి చెవి వరకు మొత్తం 22 కుట్లు ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. ఎలాంటి అంతర్గత అవయవాలు మిగలకపోవడంతో అతడి మరణానికి ఖచ్చితమైన కారణాన్ని ఫోరెన్సిక్ పరీక్షలో నిర్ధారించలేకపోయారు. మరోవైపు రాకేష్ మృతదేహంలోని అన్ని అవయవాలు మాయమైనట్లు తెలుసుకుని అతడి కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. వెనుజులా సంస్థ కీలక సమాచారాన్ని దాచిపెట్టినట్లు ఆరోపించారు. రాకేష్ మరణంపై సమగ్ర విచారణ జరుపాలని, ఆర్థిక పరిహారం ఇవ్వాలని అతడి కుటుంబం డిమాండ్ చేసింది. కాగా, 'ఫెడరేషన్ ఆఫ్ సీఫేరర్స్ యూనియన్స్ ఆఫ్ ఇండియా' కూడా రాకేష్ మరణంపై పలు ప్రశ్నలు లేవనెత్తింది. కుటుంబానికి తెలియజేయకుండా, వారి అనుమతి తీసుకోకుండా అతడి శరీరం నుంచి కీలక అవయవాలను ఎందుకు తొలగించారని నిలదీసింది. మృతదేహానికి సంబంధించిన రసీదు నకిలీదని, అతడి భార్య పేరును తప్పుగా పేర్కొన్నారని, ఉద్యోగ ఒప్పందంలో పేర్కొన్న నౌక పేరు, అతడు వాస్తవంగా పనిచేసిన నౌక పేరుతో సరిపోలడం లేదని ఆరోపించింది. 'ఈ వ్యత్యాసాలు పలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఏమి దాస్తున్నారు? వెనిజులాలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే జోక్యం చేసుకోవాలని మేం కోరుతున్నాం' అని ఒక ప్రకటనలో యూనియన్ పేర్కొంది. రాకేష్ చౌహాన్ కుటుంబానికి న్యాయం, జవాబుదారీతనం, తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేసింది.

# అయోధ్య చోరీ కేసు.. 8 మందిలో ఎవరెంత దోచుకున్నారంటే?

**న్యూఢీల్లి జూలై 1 (మహా ప్రభ)**
యోధ్య రామాలయ నిధుల చోరీ కేసులో 8 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ నిందితుల్లో లవ్ కుశ్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రా అత్యధిక అమౌంట్ చోరీ చేసినట్లు అంచనా వేస్తున్నారు. ఆ చోరీ సొత్తును ప్రాపర్టీల్లో ఇన్వెస్ట్ చేశారు. ఇప్పటి వరకు అరడజను పైగా ప్రాపర్టీలను ట్రేస్ చేశారు. ఆ ఇద్దరికి చెందిన ఆర్థిక లావాదేవీలను ఆదాయపన్ను శాఖ పరిశీలిస్తున్నది. డబ్బు చోరీ కేసులో ఈడీ కూడా దర్యాప్తు చేపట్టాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.ఈ కేసులో అత్యధిక నగదును అవినాశ్ శుక్లా నుంచి రికవరీ చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందే.. అవినాశ్ శుక్లా ఇచ్చిన సమాచారం ప్రకారం 89 లక్షల నగదును పోలీసులు రికవరీ చేశారు. రెయిడ్ సమయంలో అతని కుటుంబానికి చెందిన ఓ యోగా సెంటర్ నుంచి మరో 5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. లవ్ కుశ్ మిశ్రా పూర్వీకుల ఇంట్లో ఉన్న ఆవుపేడ కింద దాచిన 12 లక్షల నగదు కూడా రికవరీ చేశారు. ప్రతి నెలా కేవలం 12 వేల జీతం తీసుకునే మిశ్రా.. ఆలయ చోరీ సొత్తుతో భార్య



పేరు మీద 25 లక్షల ఇళ్లు కట్టినట్లు గుర్తించారు. అతని బ్యాంక్ అకౌంట్లు, బినామీ ఆస్తులను పరిశీలిస్తున్నారు. మనిశ్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి ఇంటి నుంచి 36 లక్షలు రికవరీ చేశారు. రాంశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూ యాదవ్‌కు చెందిన ఇంటి నుంచి క్యాష్, జ్వలరీ, ప్రాపర్టీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులను కూడా విచారించారు. టెంపుల్ విరాళాలను ఓ ప్రైవేటే ఏజెన్సీ ద్వారా ఆ బ్యాంకు కౌంటింగ్ నిర్వహిస్తోంది. నాలుగు డొనేషన్ బాక్సులకు చెందిన డబ్బును 14 మంది సభ్యుల బృందం లెక్కిస్తుంది. దీంట్లో 11 మంది బ్యాంకు ఉద్యోగులు, ముగ్గురు ఆలయ ట్రస్టు సభ్యులు ఉంటారు. నిందితులు అకౌంట్ రూమ్‌లోకి యాక్సెస్ సంపాదించి అక్రమ రీతిలో డబ్బును దోచుకున్నట్లు దర్యాప్తుదారులు అంచనా వేశారు. అనుమానిత వ్యక్తుల బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే, వాళ్ల అకౌంట్లలో ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించామని పోలీసులు చెప్పారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది. అయోధ్య విరాళాల చోరీ కేసులో అరెస్టు అయిన వారిలో అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాత్సవ్, రాంశంకర్ యాదవ్ ఉన్నారు. విరాళాల హుండీ నుంచి ఈ 8 మంది డబ్బులు దోచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# శెభాష్..లోకేష్

మొదటి తరువాయి



వేస్తాయన్నారు. స్నాతకోత్సవంలో మంత్రి నారా లోకేష్ ప్రసంగం స్ఫూర్తివంతంగా సాగిందని రాష్ట్రపతి అభినందించారు. సభకు హాజరైన గ్రాడ్యుయేట్స్‌కు మంచి సందేశం ఇచ్చారని ప్రశంసించారు.


# రాగల 4 రోజులు భారీ వర్ష సూచన!

మొదటి తరువాయి

నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఈ నెల 4న బలమైన ఉపరితల గాలులు ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాల్లో వీచే అవకాశం ఉందని తెలిపింది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగుండంలో అత్యధికంగా 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 5 సెం.మీ., మెదక్ జిల్లా చేగుంటలో 5 సెం.మీ., ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో 5 సెం.మీ., ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్‌లో 4 సెం.మీ., జగిత్యాల జిల్లా పెగడపల్లిలో 4 సెం.మీ., మల్యాలలో 4 సెం.మీ., జైపూర్‌లో 4 సెం.మీ., మంచిర్యాల జిల్లా జన్నారంలో 3 సెం.మీ., పెద్దపల్లి జిల్లా ధర్మారంలో 3 సెం.మీ., కునారంలో 3 సెం.మీ., మంథనిలో 3 సెం.మీ., నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 3 సెం.మీ., మంచిర్యాల జిల్లా కోటపల్లిలో 3 సెం.మీ., రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తిలో 3 సెం.మీ., నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో 3 సెం.మీ., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 3 సెం.మీ., చంద్రుగొండలో 3 సెం.మీ., కరీంనగర్ జిల్లా గంగాధరలో 3 సెం.మీ., ఆదిలాబాద్ జిల్లా దిలావర్పూర్‌లో 3 సెం.మీ., సిద్ధిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో 3 సెం.మీ., ఆదిలాబాద్ జిల్లా తంసీలో 3 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

# పాకిస్థాన్‌పై తాలిబన్ ప్రతీకార దాడులు..

**-డ్రోన్‌లతో విరుచుకుపడ్డ ఆఫ్ఘన్ సైన్యం**
**-ఐఎస్-కే స్థావరాలే లక్ష్యమన్న తాలిబన్**
**-సరిహద్దులో ఉద్రిక్తతలు మరింత తీవ్రం**
**-పాక్ వైమానిక దాడులకు ప్రతీకార చర్యలు**
**-పౌరుల మృతులపై పరస్పర ఆరోపణలు**



**న్యూఢిల్లీ**

పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. పాకిస్థాన్ భూభాగంపై ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్ దళాలు డ్రోన్లతో దాడులు చేశాయి. పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఇవి ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ (ఐసిస్–కే) ఉగ్రవాద సంస్థ స్థావరాలని, వాటిని ధ్వంసం చేసేందుకే దాడులు చేశామని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది.పాకిస్థాన్‌పై దాడులను తాలిబన్లు సమర్థించుకున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో పౌరులపై దాడులు, విద్రోహ చర్యలకు ఈ స్థావరాల నుంచి ప్రణాళికలు రచిస్తున్నారని ఆరోపించారు. ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన 'టోలోన్యూస్' కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని ఓ పాఠశాలను ఐసిస్ ఉగ్రవాదులు రహస్య స్థావరంగా వాడుకుంటున్నారని, అందుకే దానిపై దాడి చేశామని తాలిబన్లు పేర్కొన్నారు. ఈ వైమానిక దాడుల్లో పలువురు ఐసిస్ సభ్యులు హతమయ్యారని, పౌరులకు ఎలాంటి హాని జరగలేదని ఆఫ్ఘన్ ప్రభుత్వం స్పష్టంచేసింది. రెండు రోజుల క్రితం ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో పాకిస్థాన్ భీకర వైమానిక దాడులు జరిపింది. ఈ దాడులకు ప్రతీకారంగానే తాలిబన్లు తాజా దాడులకు దిగినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ జరిపిన దాడుల్లో భారీగా పౌరులు మరణించారని ఆఫ్ఘన్ ప్రభుత్వం ఆరోపించింది. ఐక్యరాజ్యసమితి ప్రకారం.. ఈ దాడుల్లో 28 మంది పౌరులు మరణించగా, 49 మంది గాయపడ్డారు. అయితే తాము జరిపిన వైమానిక, భూతల ఆపరేషన్లలో 29 మంది ఉగ్రవాదులను హతమార్చామని పాకిస్థాన్ భద్రతాదళాలు ప్రకటించాయి. మరోవైపు ఆఫ్ఘన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ మాట్లాడుతూ.. పాక్ దాడుల్లో 38 మంది పౌరులు చనిపోయారని, వీరిలో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారని తెలిపారు. ఇదిలావుంటే.. ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులను భారత్ సోమవారం తీవ్రంగా ఖండించింది. ఇది ఆఫ్ఘన్ సార్వభౌమత్వంపై జరిగిన దాడి అని, ప్రాంతీయ శాంతికి ప్రత్యక్ష ముప్పు అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. పాకిస్థాన్ తన అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, బాధ్యతల నుంచి దృష్టి మరల్చడానికి సరిహద్దుల ఆవల ఇలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడటం ఆందోళనకరమని భారత్ విమర్శించింది. కాగా, కొంతకాలంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు క్షీణిస్తున్నాయి. తమ దేశంలో దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాదులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా.. ఈ ఆరోపణలను తాలిబన్లు ఖండిస్తున్నారు.

### రెండో విడత రైతు భరోసా

# నిధులు విడుదల

మొదటి తరువాయి

రైతులు రూ.314.91 కోట్లను లబ్ధి పొందారు. అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో(హైదరాబాద్ జిల్లాను మినహాయించగా) 20,971 మంది రైతుల ఖాతాలో రూ.11.20 కోట్లు జమయ్యాయి.

# యాదగిరిగుట్టకు నూతన పాలకమండలి ఏర్పాటు

మొదటి తరువాయి

ఆలయ ఫౌండర్ ట్రస్టీలు సభ్యులుగా నియమితులయ్యారు. వీరితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, యాదాద్రి జిల్లా కలెక్టర్, వైటీడీఏ వైస్ చైర్మన్, ఆలయ ఈవో ఎక్స్–అఫీషియో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఎక్స్–అఫీషియో, ఫౌండర్ ట్రస్టీ సభ్యులు మినహా మిగిలిన వారి పదవీకాలం రెండేళ్లు ఉంటుంది. ఈ మేరకు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా నియమితులైన మన్నె సత్యనారాయణ రెడ్డికి ఉస్మానియా, పాలమూరు విశ్వవిద్యాలయాల నుంచి రెండు పీహెచ్‌డీలు ఉన్నాయి. ఈయన గతంలో మహబూబ్‌నగర్ ఎంపీగా పనిచేసిన మన్నె శ్రీనివాసరెడ్డికి సోదరుడు.

# ప్రపంచ డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ అగ్రస్థానం

**- 103 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు**
**- రోజుకు 66 కోట్ల యూపీ ఐ లావాదేవీలు**
**-11 ఏళ్ల డిజిటల్ ఇండియాపై ప్రధాని ప్రశంసలు**
**- సాంకేతికతతో ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ప్రధాని వ్యాఖ్య**

న్యూఢిల్లీ

దేశంలో డిజిటల్ ఇండియా కార్యక్రమం ప్రారంభమై బుధవారంతో 11 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సాంకేతికతను వంద కోట్లకుపైగా భారతీయులు స్వీకరించడంతో దేశంలో విప్లవాత్మక మార్పులు జరిగాయని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా ప్రపంచ వేదికపై భారతదేశానికి కొత్త గుర్తింపును తీసుకువచ్చిందని, అభివృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి ఇది బలమైన పునాదిగా నిలిచిందని అన్నారు. 103 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లతో పాటు రోజుకు 66 కోట్ల యూపీ ఐ లావాదేవీలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ ఒక వీడియోను షేర్ చేశారు. '11 ఏళ్ల డిజిటల్ ఇండియా విజయం ప్రపంచవ్యాప్తంగా భారతదేశానికి ఒక కొత్త గుర్తింపును




ఇచ్చింది. ఆవిష్కరణలు, సాంకేతికతను స్వీకరించాలన్న దేశ ప్రజల సంకల్పాన్ని ఇది వెల్లడిస్తుంది. గత 11 ఏళ్లలో డిజిటల్ ఇండియా పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడంతో పాటు సాధారణ ప్రజల జీవితాలను మరింత సులభతరం చేసింది. ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ నుంచి డిజిటల్ లావాదేవీల వరకు ఈ కార్యక్రమం సాధించిన విజయాలు ప్రపంచ దేశాల దృష్టిని భారత్ వైపు మళ్లించాయి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**2015లో ప్రారంభమైన డిజిటల్ ఇండియా**

ప్రధాని నరేంద్ర మోదీ 2015 జూలై 1న డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలో డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, ప్రభుత్వ సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతికతను ప్రతి పౌరుడికి చేరవేయడం దీని ప్రధాన లక్ష్యాలు. బ్రాడ్ బ్యాండ్ హైవేలు, మొబైల్ కనెక్టివిటీ, పబ్లిక్ ఇంటర్నెట్ సెంటర్లు, ఈ గవర్నెన్స్, ఆన్లైన్ సేవలు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఐటీ ఉద్యోగాలు వంటి తొమ్మిది ప్రధాన స్తంభాల ఆధారంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

**యూపీఐతో ఆర్థిక విప్లవం**

భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన బలంగా మారిన యూపీఐ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది. రోజుకు సగటున 66 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతుండటం ద్వారా భారత్ డిజిటల్ పేమెంట్స్ రంగంలో ముందు వరుసలో ఉంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో దాదాపు 49 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం జీడీపీలో 12 నుండి 14 శాతం వరకు వాటా కలిగి ఉండగా, వచ్చే దశాబ్దంలో ఇది 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

# ఆదాయం పెంచండి

మొదటి తరువాయి

అనంతరం మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆదాయ సమీకరణపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజు, మైనింగ్‌ల్లో లీకులు లేకుండా చూడాలని సూచించారు. ఆదాయ సమీకరణ కోసం ఛేజింగ్ సెల్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఐతో లబ్ధిదారుల జాబితాను డీబీటీకి అనుసంధానం చేయాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేలా బడ్జెట్టును తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టుల భూసేకరణకు మొదటి ప్రాధాన్యత తీసుకోవాలన్నారు. బడ్జెట్ ఊహాజనితంగా కాకుండా వాస్తవికతంగా రూపొందించుకోవాలన్నారు. వివిధశాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఆదాయ పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందేనని ఆదేశించారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్



వంటి కీలక శాఖలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఆదాయ పెంపు ప్రక్రియను రోజువారీ పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక 'ఛేజింగ్ సెల్' ఏర్పాటు చేసి, నిరంతరం ఫాలోఅప్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల పారదర్శకత కోసం సరికొత్త సాంకేతికతను వాడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ టెక్నాలజీ)ని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను ఖరారు చేయాలని, దానిని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కి అనుసంధానం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఇకపై కేవలం అంకెలకే పరిమితమయ్యే ఊహాజనిత బడ్జెట్ కాకుండా, క్షేత్రస్థాయి వాస్తవికత ఆధారగానే కొత్త బడ్జెట్‌ను రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా నిధుల కేటాయింపులు ఉండాలని, అందుకోసం భూసేకరణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించాలంటే శాఖ వారీగా అధికారులు తమ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.

# అమెరికాతో చర్చలకు ఇరాన్ సిద్ధం

**-విఫలమైతే యుద్ధానికీ వెనుకాడబోమన్న హెచ్చరిక**
**-అణు హక్కుల విషయంలో రాజీ లేదన్న తేహ్రాన్**
**-దోహాలో కీలక మధ్యవర్తిత్వ చర్చలు**
**-ఆంక్షల ఎత్తివేత, ఒప్పందంపైనే ఇరాన్ పట్టుదల**
**-అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్**

**న్యూఢిల్లీ**

ఖతార్ రాజధాని దోహా వేదికగా అమెరికా తో కీలకమైన చర్చలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అగ్రరాజ్యానికి ఇరాన్ గట్టి హెచ్చరికలు చేసింది. తాము దౌత్యపరమైన శాంతి చర్చలకు కట్టుబడి ఉన్నామని, ఒకవేళ ఈ చర్చలు విఫలమై ఇచ్చిన మాట తప్పితే మాత్రం యుద్ధానికి కూడా సిద్ధమేనని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రధాన ప్రతినిధి మహమ్మద్ బాగెర్ గాలిబాఫ్ స్పష్టంచేశారు. శుద్ధిచేసిన యురేనియంతో కూడిన తమ దేశ అణు హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అది ఇరాన్ విధించుకున్న 'రెడ్ లైన్' అని



ఆయన తేల్చిచెప్పారు. అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలోని కొన్ని కీలక నిబంధనలను పూర్తిగా అమలుచేసే వరకు తాము తదుపరి దశకు వెళ్లబోమని ఇరాన్ స్పష్టంచేసింది. ముఖ్యంగా లెబనాన్‌లో యుద్ధాన్ని ముగించి దాని సార్వభౌమత్వాన్ని కాపాడటం, ఇరాన్ చమురు ఎగుమతులు, అలాగే వ్యూహాత్మక హార్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకల భద్రత వంటి అంశాలపై పట్టుబట్టింది. గతంలో 2015 నాటి అణు ఒప్పందం విషయంలో అమెరికా ఇచ్చిన హామీలను ఉల్లంఘించిన తీరును గాలిబాఫ్ ఈ సందర్భంగా విమర్శించారు. లెబనాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య సంబంధాల సాధారణీకరణ కోసం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రయత్నిస్తున్నారని, ఇది ప్రస్తుత అవగాహన ఒప్పందానికి విరుద్ధమని ఆరోపించారు. అమెరికా విధించిన ఆంక్షలు (బ్లాకేడ్) తొలగిపోయిన తర్వాత తమ దేశ చమురు ఎగుమతులు పెరిగాయని, ప్రస్తుతం 40 మిలియన్ బారెళ్లకు పైగా చమురును ఎగుమతి చేస్తున్నట్లు గాలిబాఫ్ వెల్లడించారు. ఖతార్ విదేశాంగ మంత్రి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మధ్యవర్తిత్వ చర్చలలో అమెరికా అధికారులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లు కూడా పాల్గొంటున్నారు. అవగాహన ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతోనే ఈ దోహా చర్చలు జరుగుతున్నప్పటికీ, ఇరాన్ ఒకవైపు చర్చలకు వస్తూనే.. మరోవైపు సైనికపరంగా యుద్ధానికి సై అనడం అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.

# భారత్-పాక్ సంబంధాలు పునరుద్ధరించండి..

**-మోదీ, షెహబాజ్ షరీఫ్‌కు 117 మంది ప్రముఖుల బహిరంగ లేఖ**
**-భారత్--పాక్ సంబంధాల పునరుద్ధరణకు విజ్ఞప్తి**
**-వీసాలు, విమానాలు, వాణిజ్య సేవలు పునఃప్రారంభించాలని సూచన**
**-అట్టారి--వాఘా సరిహద్దు తెరవాలని ప్రతిపాదన**
**-వైరం వల్ల యువత, ఆర్థిక వ్యవస్థకు నష్టమని ఆందోళన**

**న్యూఢిల్లీ**

ఇటీవలి కాలంలో ఇండియా, పాక్ మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. గతంలోనే అంతంతమాత్రంగా ఉన్న ద్వైపాక్షిక సంబంధాలు గత ఏడాది పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌ల తర్వాత పూర్తిగా దెబ్బతిన్నాయి. చివరకు పాకిస్తాన్‌కు నీళ్లు కూడా ఇవ్వకూడదని భారత్ నిర్ణయం తీసుకుంది. ఏడాదిపైగా ఇరు దేశాల మధ్య వైరం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య శాంతి నెలకొనేలా చూడాలని, చర్చలు జరపాలని, గతంలోలాగా ద్వైపాక్షిక సంబంధాలు పునరుద్ధరించాలని కోరుతూ.. ఇండియా, పాకిస్తాన్‌లకు చెందిన 117 మంది ప్రముఖులు భారత ప్రధాని నరేంద్ర మోదీకి, పాక్ ప్రధాని



షెహబాజ్ షరీఫ్‌కు బహిరంగ లేఖ రాశారు. ఇందులో ఇండియా నుంచి 61 మంది, పాకిస్తాన్ నుంచి 56 మంది ప్రముఖులు ఉన్నారు. ఇరు దేశాలు దీర్ఘకాలంగా కొనసాగుతున్న తమ శతృత్వాన్ని పక్కనబెట్టాలని లేఖలో కోరారు. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన వల్ల రెండు దేశాలకు చెందిన లక్షలాది మంది యువత ఇబ్బంది పడుతున్నారని, అనేక అవకాశాలు కోల్పోతున్నారని, ఆర్థికపరంగా నష్టం కలుగుతోందని లేఖలో వివరించారు. విశ్వాసం పెంపొందించేందుకు ఇరు దేశాల నేతలు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, రెండు దేశాల మధ్య దౌత్యపరమైన సేవలు తిరిగి పునరుద్ధరించాలని, సాధారణ వీసా సేవలు, విమానయాన సేవలు ప్రారంభించాలని కోరారు. రెండు దేశాల సరిహద్దు అయిన అట్టారి–వాఘా మార్గాన్ని తెరవాలని, వ్యాపారం, వాణిజ్యం, పర్యటనలకు అవకాశం కల్పించాలని లేఖలో ప్రస్తావించారు. ఈ లేఖ రాసిన వారిలో ఇండియా నుంచి నేషనల్ కాంగ్రెస్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, వేర్పాటువాద నాయకుడు మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, టీఎంసీ మాజీ మంత్రి హుమాయున్ కబిర్ వంటి ప్రముఖులు ఉన్నారు. పాకిస్తాన్ నుంచి మాజీ విదేశాంగ మంత్రి ఖుర్షిద్ మహమూద్ కసూరి, మాజీ దౌత్యవేత్త అష్రాఫ్ జెహంగిర్ ఖ్వాజి, అణుశాస్త్రవేత్త పర్వేజ్ వంటి వారు ఉన్నారు. అయితే, పాకిస్తాన్‌తో ఎలాంటి దౌత్యపరమైన, వాణిజ్యపరమైన సంబంధాలు లేవని గతంలోనే ఇండియా తేల్చి చెప్పింది. దీనిలో భాగంగా సింధు నది జలాల ఒప్పందాన్ని కూడా ఇండియా రద్దు చేసింది.


# చర్చకు సిద్ధమే..

మొదటి తరువాయి

నుంచి తప్పుకుంటానని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ దివాలా తీసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబం, మంత్రులు, కాంగ్రెస్ నేతల దోపిడీ వల్లే తెలంగాణ దివాలా తీస్తున్నదని విమర్శించారు. ఢిల్లీకి పోతే ఇజ్జత్ లేదంటున్న రేవంత్ రెడ్డి, 72 సార్లు ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు.కేసీఆర్ హయాంలో అప్పుల గురించి రేవంత్ రెడ్డి నిత్యం అబద్ధాలు చెప్తున్నారని అన్నారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2023 వరకు తెలంగాణ అప్పు రూ.3.50 లక్ష?ల కోట్లని పార్లమెంటులో కేంద్రం చెప్పిందన్నారు. ఇందులో ఉమ్మడి రాష్ట్రం నుంచి వచ్చిన అప్పు రూ.72 వేల కోట్లు, కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ.2.78 లక్షల కోట్లని వివరించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ. 8.11 లక్షల కోట్లు అప్పు చేశారంటూ నిత్యం అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అప్పులే కాకుండా రాష్ట్ర ఆదాయంతోపాటు అప్పులకు కడుతున్న వడ్డీ లెక్కలపైనా సీఎం తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం చెప్పింది నమ్మాలా?, కాగ్ చెప్పింది నమ్మాలా?అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతాంగానికే రూ.1.13 లక్ష?ల కోట్లు ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు. రైతు బంధు ఇవ్వకుండా, సంపూర్ణ రుణమాఫీ చేయకుండా, కౌలు రైతులకు, రైతు కూలీలకు చెప్పిన ఆర్థిక సహాయం చేయలేదన్నారు. రైతాంగానికి బాకీ పడ్డ రూ.1.13 లక్ష?ల కోట్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఎకరానికీ రైతుభరోసా ఆశీర్వాద సభలు నిర్వహిస్తున్నారని అన్నారు. రైతాంగానికి, విద్యార్థులకు, మహిళలకు, రిటైర్డ్ ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించడానికి డబ్బులు లేవు కానీ రాహుల్ గాంధీకి మాత్రం రూ.వెయ్యి కోట్లు ఇస్తానంటూ రేవంత్‌రెడ్డి చెప్తున్నారని తెలిపారు.

# సంపాదకీయం

## స్కూళ్ల మూసివేత!?




ప్రభుత్వ విద్యను రాష్ట్రంలో పరిమితం చేసే అవకాశం కనిపిస్తున్నది. స్కూళ్ల హేతు బద్దీకరణ ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నది. తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను సమీప స్కూళ్లలో విలీనం చేయాలనే ప్రణాళికతో సర్కార్ అడుగులేస్తున్నది! అదే సమయంలో కేంద్రీకృత, సమీకృత ప్రభుత్వ పాఠశాలల కోసం ప్రయత్నం చేస్తున్నది. స్కూళ్లను తగ్గించడం ద్వారా సర్కారీ విద్యను పున:నిర్మాణం చేస్తామం టున్నది. పిల్లల్లేని వేలాది చిన్న పాఠశాలలను నడిపే కంటే, ఆధునిక సౌకర్యాలతో కూడిన సమీకృత పాఠశాలలను స్థాపించడంపై దృష్టి పెట్టింది. కొరతను అధిగమించడానికి విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నా పాఠశాలల నుంచి మిగులు ఉపాధ్యాయులు, సిబ్బందిని , సహాయక పోస్టులను డిమాండ్ ఎక్కువగా ఉన్న పాఠశాలల్లోకి సర్దుబాటు చేస్తున్నది. ఇది రాష్ట్ర, జాతీయ విద్యాహక్కు (ఆర్‌టీఈ) చట్టానికి వ్యతిరేకం. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన పాలకా గణం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం పట్ల విద్యా వేత్తల నుంచే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకటిన్నర కిలోమీటర్ల పరిధిలో ప్రాథమిక, మూడు కి.మీ. ప్రాథమికోన్నత, ఐదు కి.మీ.ల్లో ఉన్నత పాఠశాలు ఉండాలి. కొత్త విధానం పేరుతో పాఠశాల లను మూసివేయడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రేషనలైజేషన్‌పై రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. నేటి పోటీ ప్రపంచంలో చదువు ప్రాధాన్యత ఎంతటిదో అందరికి తెలిసిందే. రేషనలైజేషన్ మూలంగా గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో అణగారిన తరగతుల కు విద్య అందదు. అంతేగాక తక్కువ ఆదాయ కుటుంబాలను సరైన ఫీజు నియంత్రణ లేని ఖరీదైన ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలవైపు బలవంతంగా నెట్టడమే అవుతుంది. స్కూళ్ల మూసివేతకు బదులుగా ఉపాధ్యా య ఖాళీలను భర్తీ చేయడం, మౌలిక సదుపాయాలను కల్పించాలి. రాష్టంలోని 28 వేల స్కూళ్లకు గాను నాలుగు వేలకు కుదించాలని ఇటీవల ఓ కార్యక్రమంలో సీఎం ప్రకటించడం గమనార్హం. టీచర్ పోస్టుల్నీ రేషనలైజేషన్ చేయడం ఒక భాగమైతే, దాని ప్రభావం పేదలను చదువుకు సాంతం దూరం చేయడమే అవుతుంది. ఎందుకంటే అందుబాటులో స్కూల్ లేకపోతే బడి మానేసే పరిస్థితి వస్తుంది. ఇప్పటికే ప్రతియేటా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మి షన్లు తగ్గుతున్నాయి. రెండేండ్లుగా వేల పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు రావడాన్ని కారణంగా చెబుతూ ఆరుట్ల మోడల్‌ను సర్కార్ ముందు కు తెచ్చింది. ఆనక స్కూళ్ల సంఖ్యను తగ్గింపునకు శ్రీకారం చుట్టింది. ఇందుకు విద్యా కమిషన్ నివేదికను అడ్డం పెట్టుకుంది. ఒక్కో పాఠశాలలో పదిహేను వందల నుంచి రెండు వేల మంది విద్యార్థులు చదవుకునేలా ప్రతి మండలానికి రెండు నుంచి మూడు బడులుంటే చాలనే ఆలోచనతో ముందుకు పోతున్నది.కాగా 'క్యూర్' పరిధిలో భారీగా జనాభా పెరుగుతున్నది. అంతేగాక పల్లెల నుంచి పట్టణాలకు, ప్రధానంగా రాజధానికి ఉపాధి కోసం లక్ష?ల కుటుంబాలు వస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో నివసించే వారి పిల్లలకు కొత్త స్కూళ్లు పెట్టే ప్రయత్నమే లేదు!? వారంతా ప్రయివేటుకు వెళ్లాల్సిన పరిస్థితి సర్కారే కల్పిస్తున్నది. ఇది ప్రయివేటును ప్రోత్సహించి ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడమే అవుతుంది. విద్యకు చేసే ఖర్చును పెట్టుబడిగా మాత్రమే చూస్తానన్న సీఎం, ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లకు దన్నుగా నిలవడం విద్యాహక్కు చట్టాన్ని నీరుగార్చడమే తప్ప వేరేకాదు. నాణ్యమైన విద్య కోసం ఉన్నవాటితో పాటు కొత్త స్కూళ్లు తేరవాలి. పంచాయతీకి ఒక స్కూల్ ఉండాలి. లేకపోతే డ్రాపౌట్లు అడ్డగోలుగా పెరుగుతాయి. భారీ స్కూళ్లకు శ్రీకారం చుట్టి ఆ తర్వాత నిర్వహించలేక ప్రయివేటుకు అప్పగించే ప్రమాదం పొంచిఉందని విద్యానిపుణుల అభిప్రాయం. ప్రభుత్వ విద్యను ఉద్ధరించడమంటే ఎన్‌జీవోలకు ధారాదత్తం చేయడం కాదు. విద్యా సంస్కరణలు ఆడంబరం కాకూడదు. మార్పునకు నాంది కావాలి. ప్రభుత్వ సారథ్యంలో ప్రీప్రైమరీ విధానం తేవాలి. లేకపోతే ఎన్ని బడిబాటలు చేసినా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగవు. నాణ్యమైన విద్య కావాలంటే క్లాస్‌తో పాటు సబ్జెక్టు టీచర్లను నియమించాలి. పటిష్టంగా పర్యవేక్ష?ంచాలి. ఉపాధ్యాయులూ బాధ్యతగా మెలగాలి. రాష్ట్రంలో ఇరవైయేండ్లుగా డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈవో పోస్టులను ప్రభుత్వాలు భర్తీ చేయడం లేదు. కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం విద్యకు బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి. గత రెండేండ్లుగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన మేరకు పదిహేను శాతం కూడా ఇవ్వలేదు. ఇచ్చింది కేవలం ఎనిమిది శాతమే. పద్దెనిమిది శాతం కేటాయించాలని విద్యా కమిషన్ సైతం సూచించింది. నిధుల్వికుండా ప్రభుత్వ పాఠశాలల్లో సంస్కరణలు విజయవంతం అసాధ్యం.

# కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో వాట్సాప్ యూజర్ నేమ్ ఫీచర్..

**- మోసాలకు తావు లేకూడదనే**

**న్యూఢిల్లీ జూలై 1 (మహా ప్రభ)**
వాట్సాప్‌లో త్వరలో యూజర్ నేమ్ పేరుతో కొత్త ఫీచర్ రాబోతున్న సంగతి తెలిసిందే. దీని ద్వారా ఇకపై యూజర్లు తమ నెంబర్ కనిపించకుండా యూజర్ నేమ్ సెట్ చేసుకోవచ్చు. ఫోన్ నెంబర్ షేర్ చేయకుండా యూజర్ నేమ్ ద్వారా ఇతరులతో చాట్ చేయవచ్చు. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ ఫీచర్‌పై కేంద్రం దృష్టి సారించింది. ఈ ఫీచర్ ఎంతవరకు ప్రమాదకరమో పరిశీలిస్తోంది. అంటే, కొత్త ఫీచర్ ద్వారా ఏమైనా ఆన్‌లైన్ మోసాలకు అవకాశం ఉందా, యూజర్ నేమ్‌ల ద్వారా ఇతర యూజర్లకు ఎలాంటి సేఫ్టీ ఉంటుంది, తప్పుడు సమాచారం చేరవేసేందుకు ఉన్న అవకాశాలు వంటి అంశాల్ని పరిశీలించనుంది.ఈ ఫీచర్‌పై కేంద్ర




ప్రభుత్వం సమీక్షించిన తర్వాతే దీనికి అనుమతి లభిస్తుంది. ఈ కొత్త ఫీచర్ ఈ ఏడాది చివరి నుంచి అందుబాటులోకి రానుంది. అంటే, ఇది ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఇతర సోషల మీడియా యాప్‌లలో ఉండే యూజర్ నేమ్‌లలాగే పని చేస్తుంది. ఇందుకోసం యూజర్లు తమ యూజర్ ఐడీని రిజర్వ్ చేసుకునే అవకాశం కూడా ఉంది. దీనిపై యూజర్లకు వాట్సాప్ సమాచారం కూడా ఇస్తోంది. ఈ కొత్త ఫీచర్ వల్ల ప్రయోజనాలతోపాటు ఇబ్బందులు కూడా ఉంటాయి. ఎవరితోనైనా తాత్కాలికంగా చాట్ చేయాల్సి వచ్చినప్పుడు ఫోన్ నెంబర్‌తో పని లేకుండా యూజర్ నేమ్ ద్వారానే చాట్ చేయవచ్చు. అయితే, ఇతరులు కూడా అలాగే, చాట్ చేస్తే వారి ఒరిజినల్ నెంబర్ గుర్తించడం కష్టం. కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఇప్పటికే ఉన్న బ్లాక్, అన్‌నోన్ కాలర్స్ సైలెన్సింగ్ వంటి ఫీచర్లు కొనసాగుతాయి. యూజర్ నేమ్ 3 నుంచి 35 అక్షరాల వరకు ఉండొచ్చు. అలాగే, ఇంగ్లీష్‌లో ఏ టు జడ్ 0-9 వరకు అంకెలు, డాట్, అండర్‌స్కోర్ మాత్రమే వాడుకోవచ్చు. యూజర్ నేమ్ ఇతరులు యాక్సెస్ చేయాలంటే నాలుగు అంకెలతో ఒక కీ కూడా సెట్ చేసుకోవాలి. కొత్తగా ఎవరితోనైనా చాట్ చేయాలంటే యూజర్ నేమ్‌తోపాటు కీ వర్డ్ కూడా షేర్ చేయాలి.

# ఖమేని అంత్యక్రియలకు బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులను ఆహ్వానించిన ఇరాన్..

**-ఆరు రోజులపాటు అంత్యక్రియలు**

**న్యూఢిల్లీ జూలై 1 (మహా ప్రభ)**
ఇరాన్ దివంగత సుప్రీంలీడర్ అయతొల్లా ఖమేని అంత్యక్రియలు మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ అంత్యక్రియలకు బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఇరాన్ ఆహ్వానించింది. ఈ నెల 4న ఖమేని అంత్యక్రియలు ప్రారంభమవుతాయి. ప్రధాన కార్యక్రమాలు జూలై 5 నుంచి 9 వరకు జరుగుతాయి. గత ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా జరిపిన దాడిలో అయతొల్లా ఖమేని (86)తోపాటు పలువురు అతడి కుటుంబ సభ్యులు మరణించిన సంగతి తెలిసిందే.ఖమేనితోపాటు మిగతావారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇరాన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అత్యంత



ప్రతిష్టాత్మకంగా, భారీగా ఈ అంత్యక్రియల్ని నిర్వహించబోతుంది. దీనిలో భాగంగా వివిధ దేశాలకు చెందిన అధినేతలు, ప్రతినిధులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తోంది. ఇప్పటికే భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇరాన్ ఆహ్వానం పలికింది. ఖమేని అంత్యక్రియలకు మోదీ రావాలని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ కోరారు. అయితే, వివిధ కారణాల రీత్యా మోదీ ఈ కార్యక్రమానికి హాజరు కావడం లేదు. కానీ, ఇరాన్ ఆహ్వానాన్ని మన్నించి ఇండియా తరఫున ప్రతినిధులను ప్రభుత్వం అధికారికంగా పంపించనుంది. ఇండియా తరఫున కేంద్ర మంత్రి పవిత్రా మార్గెరిటా, బిహార్ గవర్నర్ సయ్యద్ అటా హస్నైన్ హాజరుకానున్నారు. ఇదే సమయంలో తాజాగా బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను కూడా ఇరాన్ ఆహ్వానించింది. వీరు ఇరాన్ వెళ్లడంపై ఇంకా స్పష్టత లేదు. ఇక, ఈ అంత్యక్రియలు దాదాపు ఆరు రోజులు జరుగుతాయి. ముందుగా నివాళులు అర్పించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 9న అంత్యక్రియలు పూర్తి చేస్తారు. ఈ కార్యక్రమాలకు దాదాపు 12 మిలియన్ల నుంచి 20 మిలియన్ల వరకు ప్రజలు హాజరవుతారని ఇరాన్ అంచనా. దీనికి అనుగుణంగా ఇరాన్ ప్రభుత్వం భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. రవాణా, వైద్యపరమైన ఏర్పాట్లతోపాటు ట్రాఫిక్ ఆంక్షలు వంటివాటిని పర్యవేక్షిస్తోంది. దేశ చరిత్రలో నిలిచిపోయేలా ఈ అంత్యక్రియలు జరపాలని ఇరాన్ ప్రభుత్వం నిర్ణయించింది.

# గోవధపై సుప్రీంకోర్టుకు తమిళనాడు ప్రభుత్వం..

**-మద్రాస్ హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా పిటిషన్**

**న్యూఢిల్లీ జూలై 1 (మహా ప్రభ)**
గోవధపై నిషేధం విషయంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంలో గోవధను నిషేధిస్తూ గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమిళనాడు సెక్రెటరీ ఈ పిటిషన్ దాఖలు చేశారు. మద్రాస్ హైకోర్టు తీర్పు.. తమిళనాడు యానిమల్ ప్రిజర్వేషన్ యాక్ట్, 1958కి వ్యతిరేకంగా ఉందని తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది.తమిళనాడు చట్టం ప్రకారం పదేళ్లు దాటిన



గోవులను, సంతానోత్పత్తికి పనికిరాని గోవులను, వ్యవసాయం వంటి వాటిలో పనికి ఉపయోగపడని వాటిని వధించవచ్చు. దీనికి సంబంధిత అథారిటీ నుంచి సర్టిఫికెట్ తీసుకుంటే చాలు. అలాగే, ఇతర కేంద్ర చట్టాలను కూడా తమిళనాడు ప్రభుత్వం ప్రస్తావించింది. దీని ప్రకారం నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని వధించవచ్చుని, కానీ, పూర్తిగా గోవధపై నిషేధం విధించే చట్టం లేదని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ పిటిషన్‌లో హిందూ మక్కల్ కచ్చి సంస్థ యూత్ విభాగం సెక్రెటరీ కే.సూర్య, రాష్ట్ర డీజీపీని ప్రతివాదులుగా పేర్కొన్నారు. అంతకుముందు కే.సూర్య తరఫున గత మే 27న సుప్రీంకోర్టులో అడ్వకేట్ పీవీ యోగేశ్వరన్ పిటిషన్ దాఖలు చేశారు. తమిళనాడులో బక్రీద్ సందర్భంగా ఒక్క గోవును కూడా వధించకుండా చూడాలని కేవియట్ పిటిషన్‌లో కోరారు. దీనికి అనుగుణంగా సుప్రీంకోర్టు కూడా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఒక్క గోవును వధించకూడదని ప్రభుత్వాన్ని ఆదేశించారు. అయితే, దీన్ని వ్యతిరేకిస్తూ తాజాగా విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# 109 అంతస్తుల టవర్‌ను ఢీకొన్న విమానం..

**-వివరణ ఇవ్వని చైనా**


**బీజింగ్ -01జులై (మహాప్రభ ).**
చైనా రాజధాని బీజింగ్‌లో ఉన్న 109 అంతస్తుల భవనాన్ని ఓ చిన్న విమానం ఢీకొట్టింది. ఈ ఘటన జరిగి నాలుగు రోజులు పూర్తి అయ్యింది. కానీ చైనా సర్కారు మాత్రం



ఆ ఘటన గురించి ఎటువంటి ప్రకటన చేయలేదు. ఆ ఘటనపై సోషల్ మీడియాలో వస్తున్న మీమ్స్‌ను స్థానిక ప్రభుత్వం నిషేధించింది. చాలా కట్టుదిట్టమైన ఎయిర్‌స్పేస్ ఆంక్షలు ఉండే బీజింగ్‌లో ..ఓ భారీ బిల్డింగ్‌ను విమానం ఎలా ఢీకొంటిందన్న విమర్శలు వస్తున్నాయి. అయితే సీఐటీఐసీ టవర్‌కు సమీపంలోనే కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యాలయం ఉన్నది. ఆ బిల్డింగ్‌ను విమానం ఢీకొన్న తర్వాత .. విమాన శిథిలాలు కింద పడ్డ దృశ్యాలు ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి.ఈ ఘటన తర్వాత లైట్ కంబాట్ విమానాలపై బీజింగ్‌లో నిషేధం విధించారు. సీఐటీఐసీ టవర్ ఎత్తు సుమారు 1700 అడుగులు ఉంటుంది. సన్‌వార్డ్ ఎస్‌ఏ60 ఎల్ అరోరైట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆ బిల్డింగ్‌ను ఢీకొన్నట్లు తెలుస్తోంది. అయితే టార్గెట్ చేసి మరీ ఆ టవర్‌ను పేల్చే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆ విమానం టూ-సీట్.. సింగిల్ ఇంజిన్. చైనా కంపెనీ సన్‌వార్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారు చేసింది. టూరింగ్, ఏరియల్ ఫోటోగ్రఫీ, రిక్రియేషనల్ ఏవియేషన్ కోసం దీన్ని డిజైన్ చేశారు. సెప్టెంబర్ లెవన్ తరహా దాడి జరిగిందా అన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి. అయితే చైనా సర్కారు తాజా ఘటన పట్ల వివరణ ఇవ్వకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

# క్రిప్టో వ్యాపారంతో 104 కోట్ల డాలర్లు ఆర్జించిన డోనాల్డ్ ట్రంప్

**న్యూయార్క్:-01జులై (మహాప్రభ ).**
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 2025లో క్రిప్టోకరెన్సీ పెట్టుబడుల ద్వారా సుమారు 104 కోట్ల డాలర్లు ఆర్జించినట్లు తెలిసింది. ట్రంప్




ఆర్థిక లావాదేవీలకు చెందిన రిపోర్టును రిలీజ్ చేశారు. అయితే ఆయన సంపద అమాంతం పెరిగినట్లు ఆ నివేదికలో తెలిపారు. ట్రంప్‌తో పాటు ఆయన కుమారులకు చెందిన క్రిప్టో వ్యాపారంలో భారీగా ఆదాయం వచ్చినట్లు తెలిసింది. క్రిప్టో పెట్టుబడుల ఆదాయం గురించి అమెరికా ప్రభుత్వాన్ని ట్రంప్ వెల్లడించారు.సాధారణంగా రియల్ ఎస్టేట్, గోల్ఫ్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టే ట్రంప్ ఫ్యామిలీకి.. గత ఏడాది క్రిప్టో వ్యాపారం ద్వారా దాదాపు 104 కోట్ల డాలర్లకుపైగా ఆదాయం వచ్చినట్లు తెలిసింది. వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ అనే క్రిప్టో కంపెనీ ద్వారా ట్రంప్ సుమారు 800 మిలియన్ల డాలర్లు ఆర్జించారు. ఆ కంపెనీలో ఆయన కుమారులు కూడా భాగస్వామ్యులుగా ఉన్నారు. క్రిప్టో టోకెన్ సేల్స్ ద్వారా 520 మిలియన్ల డాలర్లు, ఇక వరల్డ్ లిబర్టీ బిజినెస్ లో క్రిప్టో అమ్మకాల ద్వారా మరో 250 మిలియన్ల డాలర్లు ఆర్జించినట్లు తెలిసింది. ట్రంప్ మీమి కాయిన్ల అమ్మకం ద్వారా అదనంగా 635 మిలియన్ల డాలర్లు ఆర్జించారు. రెండో సారి దేశాధ్యక్షుడిగా అధికారం చేపట్టిన తర్వాత ట్రంప్ క్రిప్టో ఆస్తులు ఒక్కసారిగా జంప్ చేశాయి. 2024లో ట్రంప్ టోకెన్ సేల్స్ ద్వారా కేవలం 57.35 మిలియన్ల డాలర్లు మాత్రమే ఆర్జించారు.అయితే తాజా గణాంకాల ప్రకారం ట్రంప్ క్రిప్టో ఆస్తులు సుమారు తొమ్మిది రెట్లు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు.

# చికిత్స పొందుతు గృహిణి మృతి

-భర్త పరిస్థితి విషమం




**పాపన్నపేట జూలై 1( మహాప్రభ )**
పాము కాటు కు గురై న దంపతులు చికిత్స పొందుతు భార్య మృతి చెందాగా భర్త పరిస్థితి విషమం గా ఉన్న సంఘటన బుధవారం టేక్మాల్ మండల పరిధిలోని పాపన్నపేట పోలిస్టేషన్ పరిధిలోని బోడగట్టు గ్రామంలో చోటుచేసుకుంది. పాపన్న పేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.మల్లయ్య గారి కవిత(35) సంగమేష్ దంపతులు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులు అందరు కలిసి భోజనాలుముంగించుకుని ఇంటిలో నిద్రిస్తుండగా భార్యభర్తలు కవిత,సంగమేష్ లకు నల్ల కట్ల పాటు కాటు వేయడం తో కుటింబికుల కు సూచించడం తో కుటింబికులు వెంటనే పామును గుర్తించి కర్రల సహాయం తో అంతమోందించి. పాము కాటుకు గురైన ఇరువురిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారంఉదయం భార్య కవిత మృతి చెందగాభర్త సంగమేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపనట్లు కుటింబికులు తెలిపారు. ఈ విషయమై మృతురాలు మామ దుర్గయ్య పిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# దేవరకొండ ఆర్టీసీ డిపోలో డ్రైవర్ కె.ఆర్. రెడ్డి పదవీ విరమణ

-శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు



**దేవరకొండ జూలై 1 ( మహాప్రభ )**
దేవరకొండ ఆర్టీసీ డిపోలో సుదీర్ఘకాలం పాటు డ్రైవర్‌గా విధులు నిర్వహించి, నేడు పదవీ విరమణ పొందుతున్న కె.ఆర్. రెడ్డికి డిపో సిబ్బంది మరియు కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో డిపో మేనేజర్ విజయకుమార్ మాట్లాడుతూ, కె.ఆర్. రెడ్డి సంస్థకు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

**సమావేశంలో డిపో మేనేజర్ విజయ కుమారి మాట్లాడుతూ...**
“కె.ఆర్. రెడ్డి సంస్థ పట్ల ఎంతో నిబద్ధతతో పనిచేశారు. అధికారుల మన్ననలు పొందడమే కాకుండా, తోటి ఉద్యోగులతో ఎంతో స్నేహపూర్వకంగా మెలిగేవారు. ఆయన క్రమశిక్షణ, పని పట్ల అంకితభావం అందరికీ ఆదర్శప్రాయం,” అని పేర్కొన్నారు.

**తోటి ఉద్యోగుల ప్రశంసలు:**
ఈ కార్యక్రమంలో పాల్గొన్న తోటి డ్రైవర్లు, కండక్టర్లు మాట్లాడుతూ, కె.ఆర్. రెడ్డి వృత్తి పట్ల చూపే నిబద్ధత తమకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రయాణికులతో ఆయన వ్యవహరించే తీరు, మాట్లాడే పద్ధతి ఎంతో హుందాగా ఉండేవని, ఆయనతో కలిసి పనిచేయడం తమకు ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.ఆర్. రెడ్డి సతీమణి అన్నపూర్ణ, కుమారుడు పవన్ కుమార్, కోడలు కృతి ,అల్లుడు ప్రణవ్, కుమార్తె నిహారిక, తమ్ముళ్లు గోవర్ధన్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డిలతో పాటు డిపో మేనేజర్ విజయకుమార్, ఎం.ఎఫ్. కృష్ణయ్య, ఏడీసీ దీప్లాల్ మరియు ఆర్టీసీ సిబ్బంది, తోటి డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు కె.ఆర్. రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# దేవరకొండలో ఘనంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం

- వైద్యులకు ఘన సన్మానం




**దేవరకొండ జూలై 1 ( మహాప్రభ )**
బుధవారం ఇంటర్నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం దేవరకొండ వారి ఆధ్వర్యంలో దేవరకొండ ఐఎంఏ వైద్యులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తూ సమాజానికి అండగా నిలుస్తున్న ప్రతి వైద్యునికి హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు “వైద్యో నారాయణో హరిః” అనే మహోన్నత భావాన్ని ఆచరిస్తూ సేవలందిస్తున్న ప్రతి వైద్యునికి మా సంఘం రపున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం దేవరకొండ

# అంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి

**-ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత**

**-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ డివిజన్ జూలై 1 ( మహాప్రభ )**
చందంపేట మండలం ఉస్మాన్ కుంట గ్రామపంచాయతీలో ఆంజనేయ స్వామి ధ్వజస్తంభం ప్రతిష్ట పవన మహోత్సవం ప్రతి ఒక్కరూ ఆంజనేయస్వామి అనుగ్రహం పొందాలి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.బుధవారం చందంపేట మండలం ఉస్మాన్ కుంట గ్రామంలో నూతన నిర్మించిన అంజనేయ స్వామి ధ్వజ స్తంభం ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అని ఆయన అన్నారు.ఆంజనేయ స్వామి కృషితో ప్రజలందరూ ఆయురారోగ్యాలు ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పాలనలో ఆలయాలకు మహర్దశ వచ్చిందని అన్నారు. సనాతన హిందూ ధర్మరక్ష పరిరక్షణ కోసం కేసీఆర్ విశేష కృషి చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం, పునర్నిర్మాణం కోసం బీఆర్ఎస్ సర్కారు నిర్విరామంగా కృషి చేసిందని అన్నారు. రాష్ట్రంలోని 4,805 ఆలయాల ధూప, దీప, నైవేధ్యాల కోసం ప్రభుత్వం ప్రతి దేవాలయానికి రూ.6వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించిఅంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి

**ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత**

**-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

ప్రతి ఒక్కరూ అంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.బుధవారం చందంపేట మండలం ఉస్మాన్ కుంట గ్రామంలో నూతన నిర్మించిన అంజనేయ స్వామి ధ్వజ స్తంభం ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అని ఆయన అన్నారు.ఆంజనేయ స్వామి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పాలనలో ఆలయాలకు మహర్దశ వచ్చిందని అన్నారు. సనాతన హిందూ ధర్మరక్ష పరిరక్షణ కోసం కేసీఆర్ విశేష కృషి చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం, పునర్నిర్మాణం కోసం బీఆర్ఎస్ సర్కారు నిర్విరామంగా కృషి చేసిందని అన్నారు. రాష్ట్రంలోని 4,805 ఆలయాల ధూప, దీప, నైవేధ్యాల కోసం ప్రభుత్వం ప్రతి దేవాలయానికి రూ.6వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించి ఆదుకున్నదని అన్నారు. దీనిలో రూ.2వేలు నిత్య పూజల కోసం, రూ.4 వేలు అర్చకుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఆలయాలకు పునర్వైభవం వచ్చిందన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలు కేసీఆర్ కృషితో ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ పున:నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను, కామన్ గుడ్ ఫండ్ నిధులతో ఇతర ఆలయాల జీర్ణోద్ధరణ, దేవాలయాల నిర్మాణ పనులను శరవేగంగా కేసీఆర్ సర్కార్ చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ విశేష కృషి చేసిందన్నారు. అనంతరం మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య, కేతవత్ శంకర్ నాయక్,సర్పంచ్ సత్యనారి, రామావత్ మోహన్ కృష్ణ,కేతావత్ రమేష్, లోటావత్ బీమా నాయక్, దాసు భావోజీ, ఉప సర్పంచ్ అను అతిరాం, ఫకీరా నాయక్, కేతావత్ హేము నాయక్, మంగ్య నాయక్,చందర్,లక్కు,జబ్బర్, బిచ్చు, మంగతా, భాషా, జైల్ సింగ్,అరుణ్,అనిల్,తదితరులు ఉన్నారు. జైల్ సింగ్,అరుణ్,అనిల్,తదితరులు ఉన్నారు.

## పారదర్శకత రెవిన్యూ పాలనే లక్ష్యంగా జవాబుదారితనంతో వ్యవహరించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి.

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -01జులై (మహాప్రభ ).**
బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ , నర్సాపూర్ తూప్రాన్ ఆర్డీవోలు అన్ని మండలాల తహసీల్దార్లతో భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి దరఖాస్తులు, రెవిన్యూ పాలనపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. డివిజన్లు, మండలాల వారీగా భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ భూ భారతి పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని . పట్టాదారు పాస్ పుస్తకాలు, నమోదైన వివరాలు, వారసత్వ హక్కుల నమోదు, సర్వే నంబర్ల వారిగా భూ వివరాల ధృవీకరణ తదితర నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. భూ భారతి కార్యక్రమం అమలు పురోగతి, భూ రికార్డుల పరిశీలన, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వ అవసరాలకు, అభివృద్ధి పనులకు సంబంధించిన భూ సేకరణలో నిబంధనలు పాటిస్తూ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.సాదా బైనామా దరఖాస్తులను జాప్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పత్రాలు, ఆధారాలు, గ్రామ పత్రాలు ఆధారంగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు ఈ కార్యక్రమంలో సంబంధిత తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



**మెదక్ జిల్లా -01జులై (మహాప్రభ ).**
మెదక్ పట్టణంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, మెదక్ మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు పర్యటించారు. పట్టణంలోని 20వ వార్డు ఫతేనగర్ లో కాంగ్రెస్ నాయకులు దయాసాగర్ తండ్రి అనారోగ్యం పరిస్థితి ఉన్నందున ఓదార్చి వారి కుటుంబ సభ్యులకు నేను అండగా ఉంటానని మనో ధైర్యని ఇచ్చారు.పట్టణంలోని 15 వార్డులోని కట్టకింద బస్తీలో కాంగ్రెస్ కార్యకర్త గోదాల బాలయ్య గారి సతీమణి గోదల గంగ స్వర్గస్తులు అయినందున వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని నింపాడు పట్టణంలోని 11వ వార్డు లో మాజీ కౌన్సిలర్ సమియుద్దిన్ సోదరుడు మరణించిన వార్త తెలుసుకున్న తర్వాత వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు బాధలో ఉన్న కుటుంబాలను పరామర్శించి మనోధైర్యాన్ని నింపడం వారికి అన్ని విధాలుగా నేను అండదండగా ఉంటానని ఓదార్చరు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా నేను అండగా ఉంటానని ఎవరికి ఇబ్బంది వచ్చినా నేనున్నానని భరోసా కలగజేయడం వల్ల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



**మెదక్ జిల్లా -01జులై (మహాప్రభ )**
ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2026( సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026) లో భాగంగా బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా. కలెక్టర్ గారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతపై బాధ్యతగా మెలిగి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం దిశగా భాగస్వామ్యం కావాలన్నారు ఇంటి వద్దనే ఘన వ్యర్థాలు నాలుగు విభాగాలుగా వేరుచేసి గ్రామపంచాయతీ సిబ్బందికి ఇవ్వాలని , సూచించారు. నాలుగు రకాల చెత్త తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త ప్రత్యేక జాగ్రత్త చెత్త గా వేరుచేసి ఇవ్వాలని ,తడి చెత్తకు ఆకుపచ్చ రంగు డస్ట్ బిన్, పొడిచేతకు బ్లూ కలర్ డస్ట్ బిన్, సానిటరీ చెత్తకు రెడ్ కలర్ డస్ట్ బిన్ మరియు ప్రత్యేక జాగ్రత్త చెత్తకు వాడా బ్లాక్ కలర్ డస్ట్ బిన్ లను వాడాలని తెలియజేయడం జరిగిందన్నారు.మెదక్ జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు మరియు అన్ని గ్రామపంచాయతీలో, అన్ని గ్రామపంచాయతీ, మండల, డివిజన్ జిల్లా ప్రభుత్వ మరియు ప్రైవేటు కార్యాలయాల్లో, షాపుల్లో , పరిశ్రమల్లో డాబాల్లో హోటల్స్ లో రైల్వేస్టేషన్లో, బస్టాండ్లలో హాస్పటల్లో తప్పనిసరిగా చెత్తను నాలుగు రకాలుగా వేరుచేసి ఇవ్వాలని అధికారులకు మరియు ప్రైవేట్ యాజమాన్యాలకు, ప్రజలకు, మహిళా సంఘాలకు సూచించారు. తడిచిత్తలో భాగంగా మిగిలిన ఆహారము, వంటింటి చెత్త, కూరగాయలు, పండ్ల తొక్కలు, వాడిన పూలు ,మాంసము చెత్త మొదలగునవి ఉంటాయని ,వీటితో కంపోస్ట్ ఎరువు తయారు అవుతుందని తెలిపారు. పొడి చెత్తలో భాగంగా కాగితము ,అట్టపెట్టెలు ప్లాస్టిక్ వస్తువులు, లోహపు వస్తువులు, సీసాలు, రబ్బరు మొదలైనవి రీసైక్లింగ్ చేయగలిగినవి ఉంటాయని తెలిపారు. సానిటరీ వేస్ట్ లో భాగంగా డైపర్లు, సానిటరీ ప్యాడ్స్, నాప్కిన్లు, కండోమ్స్ మొదలైనవి ఉంటాయి ఉంటాయని, వీటిని సపరేటుగా తీసుకొని ఇన్సులిరేటర్స్ యంత్రంలో పెట్టి డిస్పోజ్ చేస్తారని తెలిపారు. ప్రత్యేక జాగ్రత్త చెత్త అనగా పెయింటింగ్ డబ్బాలు, బల్బులు, పురుగుమందుల డబ్బాలు, టాబ్లెట్స్ గడువు ముగిసిన మందులు, మెడికల్ వ్యర్థాలు మొదలనే ఉంటాయి, ఎలక్ట్రానిక్ వేస్ట్ ఉంటాయని వీటిని గుర్తింపు కలిగిన రీసైక్లింగ్ డీలర్లకు పంపడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నాలుగు రకాల చెత్తను తీసుకొనుటకు ట్రాక్టర్లో నాలుగు రకాల పెద్ద డస్ట్ బిన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా సర్పంచులు, వార్డు మెంబర్లు లీడ్ ఫెసిలిటేటర్స్ గా గ్రామంలో ప్రతి ఒక్కరికి దీనిపైన ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. బల్క్ వేస్ట్ జనరేటర్స్ తప్పకుండా ఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి .వి శ్రీనివాసరావు ,అడిషనల్ కలెక్టర్ నగేష్ అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ జిల్లా పరిషత్ సిఈ ఓ ఎల్లయ్య ,డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డిఆర్వో అంబదాస్ రాజేశ్వర్ తాసిల్దారులు, డిఎస్పీలు, సిఐలు మరియు, ఎస్సైలు అధికారులు యొక్క అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు .

# ఉప్పల్ భూ పోరాటం జయప్రదం చేయండి

**- డా. చంద్రమోహన్ గౌడ్.**

**-హామీ నిలబెట్టుకోండి - నేడే తరలిరావాలని తెలంగాణ రక్షణ సేన పిలుపు.**

**మంచిర్యాల జిల్లా జూలై 1 (మహా ప్రభ)**
తెలంగాణ ఉద్యమ ఆశయాల సాధన కోసం, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో జూలై రెండో తేదీన హైదరాబాద్ ఉప్పల్ బగాయత్‌లో నిర్వహించనున్న భూ పోరాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ రక్షణ సేన మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జ్ డా. చంద్రమోహన్ గౌడ్ ఉదారి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర సాధన కోసం పోరాడిన వేలాది మంది ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, కళాకారులు, జర్నలిస్టులు, విద్యార్థులు నేటికీ ప్రభుత్వం నుంచి తగిన గుర్తింపు, భరోసా కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నేటికీ పూర్తిస్థాయిలో అమలు



చేయలేదని మండిపడ్డారు.
**"250 గజాల స్థలం ఇవ్వండి":** ముఖ్యంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు హైదరాబాద్ ఉప్పల్ బగాయత్‌లో రెండు వందల యాభై చదరపు గజాల స్థలాన్ని వెంటనే కేటాయించాలని డా. చంద్రమోహన్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ ఉద్యమంలో విశేష సేవలందించిన ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, కళాకారులు, జర్నలిస్టులు, విద్యార్థి నాయకులు, మహిళలు, యువజన సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు జూలై రెండో తేదీన జరిగే భూ పోరాట కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.నేడే (జూలై రెండో తేదీన) ఉప్పల్ బగాయత్‌లో జరిగే భూ పోరాటం తెలంగాణ ఉద్యమకారుల న్యాయమైన హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ప్రజాస్వామ్య ఉద్యమమని, మంచిర్యాల జిల్లా నుంచి ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు, యువత, మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సమితి జిల్లా యువ నాయకులు కొరకొప్పుల మహేష్ గౌడ్, రాజకొండ సురేష్, వేముల సాయి కుమార్ గౌడ్, మహిళా నాయకురాళ్లు పోలసాని హారిక రావు, సంధ్య రాణి, రజిత మరియు సంపత్ కుమార్, దుర్గం రాజశేఖర్, బెంబడి ప్రశాంత్, జహీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాల్లో శాంతి పరిరక్షణ దృష్ట్యా పోలీస్ యాక్ట్..

**-ఎస్పీ శ్రీనివాస్ రావు.**

**మెదక్ జిల్లా -01జులై (మహాప్రభ )**




మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జులై 01 నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ -- 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టాన్నే కొనసాగించాలి ...

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్...**

**తల్లాడ జూలై 1 (మహా ప్రభ)**
తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) చట్టాన్నే యథావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంజనాపురంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పులి కృష్ణయ్య మాట్లాడుతూ, 2005లో యూపీఏ-1 ప్రభుత్వం



కమ్యూనిస్టు పార్టీల ఒత్తిడి మేరకు గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలకు పని హక్కు కల్పించే ఉద్దేశంతో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వి.బి.జి.రామ్‌జీ చట్టం పేరుతో పని హక్కును బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఫోటో మ్యాపింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలి రోజువారీ వేతనాన్ని రూ.600కు పెంచాలని,ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చకపోతే వ్యవసాయ కూలీలను పెద్దఎత్తున సమీకరించి వి.బి.జి.రామ్‌జీ చట్టం ఉపసంహరించుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో మన్నేపల్లి రామారావు, శీలం సత్యనారాయణ రెడ్డి,అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, కళ్యాణపు కృష్ణయ్య, పులి వెంకట నరసయ్య,భూక్య అంజయ్య,గండమాల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# తపస్వి రామ్ రావ్ మహారాజ్ ఆశయాలు యువతకు ఆదర్శం.

**తపస్వి రామ్ రావ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.**



**మెదక్ జిల్లా -01జులై (మహాప్రభ.**
తపస్వి రామ్ రావ్ మహారాజ్ ఆశయాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు.బుధవారం హవేలీఘనపూర్ మండలంలోని ఔరంగాబాద్ తండా గేట్ వద్ద శ్రీశ్రీశ్రీ తపస్వి రామ్ రావ్ మహారాజ్, ప్రేమ్ సింగ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మా దేవేందర్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తపస్వి రామ్ రావ్ మహారాజు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. సేవాభావం, మానవతా విలువలు, ఆధ్యాత్మికతతో కూడిన ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహనీయుల ఆశయాలు, బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టడంతో పాటు భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత సమాజంపై ఉందని అన్నారు.అనంతరం గిరిజన మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యంలో పాల్గొని సందడి చేశారు. ఆమెతో కలిసి గిరిజన మహిళలు, యువత ఉత్సాహంగా నృత్యం చేయగా, భక్తులు, స్థానికులు హర్షధ్వానాలతో అభినందించారు.ఈ కార్యక్రమంలో హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్ జుబెర్,నాయకులు రంజా నాయక్, పూల్ సింగ్, సూర్యం, శ్రీను నాయక్, మోహన్ నాయక్ రంజిత్ తరుణ్, రామచంద్ర రెడ్డి, సాప. సాయిలు, శ్రీహరి, నరేందర్ రెడ్డి,రాజు, యామిరెడ్డి, నరేందర్ నాయక్, గడ్డమీది కృష్ణ గౌడ్, మాయ. మల్లేశం, శ్రీనివాస్,శ్రీకాంత్ రెడ్డి సాయి,గ్రామ పెద్దలు, భక్తులు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవం తల్లి బిడ్డ క్షేమం

**-ఆపద సమయంలో ఆపద్బాంధవులుగా నిలుస్తున్న 108అంబులెన్స్ సేవలు**

**-108 అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన బంధువులు**

**-జిల్లా ప్రజలు అత్యవసర 108 అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలి - సునీల్ కుమార్ ( జిల్లా మేనేజర్)**

**మక్తల్ జూలై 1 (మహా ప్రభ)**



నారాయణపేట జిల్లా ( ఊట్కూరు మండలం) 108 అంబులెన్స్‌లో ఓ మహిళ శిశువుకు జన్మించిన ఘటన బుధవారం ఉట్కూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది పులి మామిడి గ్రామానికి చెందిన కుర్మక్క పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108 అంబులెన్స్ సిబ్బందికి ఫోన్ చేశారు దీంతో తక్షణమే మక్తల్ 108 అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకొని ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో పెద్ద జట్రం గ్రామ మార్గమధ్యలో టెక్నీషియన్ లక్ష్మణ్ ఈ ఆర్ సి పి డాక్టర్ శివ గారి సూచనలతో అంబులెన్స్ లోనే ప్రసవం చేసినారు గర్భిణీ స్త్రీ కి ఆడ శిశువుకు జన్మనిచ్చింది అనంతరం నవజాత శిశువుకు తగు పరిచర్యలు చేస్తూ ఆక్సిజన్ అందిస్తూ తర్వాత వారిని దగ్గర్లో ఉన్న నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించామని 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపారు అక్కడ వైద్యులు పరిశీలించిన తర్వాత తల్లి బిడ్డ క్షేమమని తెలిపారు అత్యవసర సమయంలో ఆపద్బాంధవులు చాకచాక్యంగా సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లిబిడ్డల ప్రాణాలను కాపాడిన108 అంబులెన్స్ సిబ్బంది పైలెట్ శివశంకర్ టెక్నీషియన్ లక్ష్మణ్ ను బాధిత కుటుంబసభ్యులు ఆస్పత్రి వైద్యులు అభినందించారు

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి.

**- విద్యార్థులకు అవగాహన.**




**దౌల్తాబాద్, జూలై 1 (మహా ప్రభ)**
దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్టూడెంట్ కౌన్సిలర్ బి. శివకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు మంగ్తా నాయక్, సంపత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉచిత బహుమతులు, క్యాష్ ప్రైజ్‌ల పేరుతో జరిగే మోసాలు, ఏపీకే లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ భద్రత వంటి అంశాలపై వివరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడం లేదా ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని సైబర్ భద్రతకు సంబంధించిన విలువైన సమాచారాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, దయానంద్, సుధాకర్, రాజు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, భాగ్యమ్మ, రమ్య, నాగేశ్వరరావు, పవన్‌కుమార్, సమత, గంగారం తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**దేవరకొండ జూలై 1 ( మహా ప్రభ)**



స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ హాల్ లో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. అధ్యక్షుడు ఎన్ వి టి., ఎస్. ఐ, నారాయణరెడ్డి సభ్యులతో కలిసి డాక్టర్స్ అందరిని శాలువాలతో సత్కరించి పూల మొక్కలు అందజేసినారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే భగవంతుని రూపంలో డాక్టర్స్ పునర్ జన్మని ఇస్తారు అని ప్రాణాలను కాపాడటమే కాకుండా ప్రజల్లో ఆరోగ్య స్పృహను పెంపొందించడంలో వైద్యుల పాత్ర అసమానమైనది. వైద్యులు సాధారణ ప్రజల్లో ఉండే అనారోగ్యాలు, మధుమేహం మరియు ఒత్తిడి వంటి సమస్యలపై అపోహలను తొలగించి, ప్రామాణిక వైద్య సలహాలను పాటించాలని సూచిస్తారు.ఈ దినోత్సవం సందర్భంగా మీ పరిసరాల్లోని లేదా మీకు సేవలు అందించిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలియజేయాలని అన్నారు. సూపర్డెంట్ డాక్టర్ రవి ప్రకాష్ మాట్లాడుతూ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. డాక్టర్స్ చేస్తున్న సేవలను గుర్తించి ప్రతి సంవత్సరం డాక్టర్స్ డే నాడు వారిని సత్కరించడం అభినందనీయమని అని ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్ కోశాధికారి కృష్ణ కిషోర్ ఎటిఓ ప్రసన్న భాస్కర్ రెడ్డి కౌన్సిలర్ ముత్యాల రవి వంగూరు వెంకటేశ్వర్లు సన్నీ తాళ్ల సురేష్ ఎ ఐ ఎస్. ఎఫ్ వల్ల మల్ల ఆంజనేయులు కౌన్సిలర్ సాయి చంద్ర గౌడ్ కౌన్సిలర్ పొట్ట మధు కరాటే మాస్టర్ గోపి 108 రాంబాబు కానిస్టేబుల్ అనుష ఐజాక్ నాగరాజు నరేష్ రాము విజయ్ జమీర్ క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకు సింగరేణి చేయూత

**- ట్రై సైకిళ్ల పంపిణీ.**

**-శ్రీరాంపూర్ జీఎం చేతుల మీదుగా నాలుగు గ్రామాల్లో పంపిణీ.**

**మంచిర్యాల జిల్లా జూలై 1 ( మహా ప్రభ)**
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ శ్రీరాంపూర్ ఏరియా ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతలో భాగంగా వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునుగంటి శ్రీనివాస్ చేతుల మీదుగా ఇందారం, రామారావుపేట, గుడిపల్లి, కాన్కూర్ గ్రామాలకు చెందిన వికలాంగులకు ఈ ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి




సంస్థ ఎల్లప్పుడూ పరిసర గ్రామాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వికలాంగుల స్వయం ఉపాధికి, సంచారానికి ట్రై సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. లబ్ధిదారులు సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, స్థానిక నాయకులు, వికలాంగులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు. సింగరేణి అధికారుల్లో పర్యావరణ విభాగం నుంచి హనుమాన్, హరినారాయణ, ఎస్టేట్ విభాగం నుంచి వరలక్ష్మి, గుర్తింపు సంఘం అధ్యక్షులు వాజీ సైదా తదితరులు హాజరయ్యారు

# బిజినెస్

## వాహనదారులకు ఊరట..

**- పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించిన నయారా..!**



దేశంలోని వాహనదారులకు నయారా ఎనర్జీ భారీ ఊరట కల్పించింది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ.5, డీజిల్‌పై లీటర్‌కు రూ.3 చొప్పున కోత విధించింది. దేశవ్యాప్తంగా ఉన్న 7,000కు పైగా నయారా రిటైల్ ఔట్‌లెట్ల లో ఈ తగ్గిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. గత రెండేళ్లలో దేశంలో ఒక ఇంధన రిటైల్ సంస్థ ధరలను తగ్గించడం ఇదే తొలిసారి. పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు చల్లారడం, కీలకమైన సముద్ర మార్గాలు తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలోనే నయారా ఎనర్జీ పెట్రో ధరల తగ్గింపు నిర్ణయం తీసుకుంది. అయితే రాష్ట్రాల వారీగా ఉండే వ్యాట్ వంటి స్థానిక పన్నుల కారణంగా తుది రిటైల్ ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. నయారా ధరలను తగ్గించినప్పటికీ, ప్రభుత్వరంగ చమురు సంస్థలు మాత్రం పాత ధరలనే కొనసాగిస్తున్నాయి. దేశంలోని 90 శాతానికిపైగా ఇంధన మార్కెట్‌ను నియంత్రించే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్ ) తమ ధరలలో ఎటువంటి మార్పు చేయలేదు. ఢిల్లీలోని ఐఓసీ బంకుల్లో పెట్రోల్ లీటర్ రూ.102.12, డీజిల్ రూ.95.20 వద్ద స్థిరంగా ఉన్నాయి. కాగా ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో మార్చి 26న నయారా పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 పెంచింది. తాజా తగ్గింపుతో ఆ పెంపును పూర్తిగా వెనక్కి తీసుకున్నట్లయింది. మరోవైపు మే నెల ద్వితీయార్థంలో ప్రభుత్వ రంగ సంస్థలు పలు దఫాలుగా పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.7.50 చొప్పున పెంచడం గమనార్హం.

# జూన్‌లో జోరుగా జీఎస్టీ వసూళ్లు..

### రూ.1.94 లక్షలు దాటిన ఆదాయం



దేశంలో వస్తుసేవల పన్ను వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1.94 లక్షల కోట్లు దాటింది. నేడు విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం.. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే వసూళ్లు 13.9 శాతం పెరిగాయి. ముఖ్యంగా దిగుమతులపై వచ్చే పన్ను రాబడి గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. 2026 జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,94,812 కోట్లుగా నమోదైంది. గత సంవత్సరం జూన్‌లో ఈ మొత్తం రూ.1,71,105 కోట్లుగా ఉంది. ఈ పెరుగుదలలో దిగుమతులపై వచ్చే జీఎస్టీ వాటానే అధికం. దిగుమతులపై పన్ను రాబడి ఏకంగా 34.6 శాతం పెరిగి రూ.60,038 కోట్లకు చేరుకుంది. అయితే దేశీయ లావాదేవీల ద్వారా సమకూరిన జీఎస్టీ ఆదాయం మాత్రం 6.5 శాతం వృద్ధితో రూ.1,34,774 కోట్లుగా నమోదైంది. దేశీయ వసూళ్ల వృద్ధిరేటు కంటే దిగుమతులపై వసూళ్ల వృద్ధిరేటు ఎక్కువగా ఉండటం గమనార్హం. రిఫండ్‌ల తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం జూన్‌లో 11.2 శాతం వృద్ధితో రూ.1,62,377 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే నెలలో నికర వసూళ్లు రూ.1,45,984 కోట్లుగా ఉన్నాయి. ఈసారి మొత్తం రిఫండ్‌లు కూడా దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లకు చేరాయి. ఎగుమతులపై 'ఐస్‌గేట్' ద్వారా ఇచ్చిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లుగా ఉన్నాయి. ఇక నికర ఆదాయాన్ని విశ్లేషిస్తే.. దేశీయ లావాదేవీలపై వచ్చిన నికర జీఎస్టీ రాబడి కేవలం 2.6 శాతం మాత్రమే పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం ఏకంగా 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది. ఇది దిగుమతులపై ఆధారపడి పన్ను వసూళ్లు ఎంతగా పెరిగాయో స్పష్టంచేస్తోంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) గణాంకాలను పరిశీలిస్తే.. స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం వృద్ధితో రూ.6,31,699 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంలో ఈ వసూళ్లు రూ.5,82,542 కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ రాబడి 7.1 శాతం పెరిగి రూ.5,40,218 కోట్లుగా నమోదైంది. మే నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదవగా, జూన్‌లోనూ అదే స్థాయి వసూళ్లు కొనసాగడం ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సూచికగా నిపుణులు భావిస్తున్నారు.

# స్టాక్ మార్కెట్లలో రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల్లో రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలు, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో మన మార్కెట్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, రియల్టీ, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దాంతో స్టాక్ మార్కెట్‌లో రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడినట్లయ్యింది. సెన్సెక్స్ 443 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 140 పాయింట్లు లాభపడింది. సెన్సెక్స్ ఉదయం 76,545.21 పాయింట్లు (క్రితం ముగింపు 76,478.67) వద్ద స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. రోజంతా సూచీలు లాభాల్లోనే కదలాడాయి. ఇంట్రాడేలో 77,110.08 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 443.97 లాభంతో 76,922.64 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.10 పాయింట్ల లాభంతో 24,005.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఏషియన్ పెయింట్స్, హిందూస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, టీసీఎస్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 95.23 ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.34 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 3,987 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# టీ20ల్లో వరల్డ్ నెంబర్ 1 బ్యాటర్‌గా ఇషాన్ కిషన్..

**- రెండోస్థానంతో సరిపెట్టుకున్న అభిషేక్ శర్మ**



ఇటీవలి కాలంలో టీ20ల్లో వరుసగా రాణిస్తున్న ఇషాన్ కిషన్ అరుదైన ఘనత దక్కించుకున్నాడు. అంతర్జాతీయ టీ20లలో నెంబర్ 1 బ్యాటర్‌గా నిలిచాడు. టీ20 ఇంటర్నేషనల్ టోర్నీలకు సంబంధించి బుధవారం ఐసీసీ ర్యాంకులు విడుదల చేసింది. ఈ ర్యాంకుల్లో బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ నెంబర్ 1 ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ఇప్పటివరకు ఈ స్థానంలో కొనసాగిన ఇండియన్ ప్లేయర్ అభిషేక్ శర్మను ఇషాన్ వెనక్కి నెట్టాడు. దీంతో దాదాపు ఏడాదిపాటు నెంబర్ 1 ర్యాంకులో కొనసాగిన అభిషేక్ శర్మ ఇప్పుడు రెండో ర్యాంకుతో సరిపెట్టుకున్నాడు. పాయింట్ల టేబుల్‌లో ఇషాన్ కిషన్ 876 పాయింట్లు సాధించగా, అభిషేక్ శర్మ 869 పాయింట్లు సాధించాడు. ఇషాన్.. ఈ ఏడాది జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో సత్తా చాటాడు. 9 మ్యాచుల్లో 317 పరుగులు సాధించి ఇండియా కప్పు గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. అంతేకాదు.. ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన రెండో భారత ఆటగాడిగా నిలిచాడు. సంజూ శాంసన్ టోర్నీలో అత్యధిక పరుగులు సాధించాడు. ఇషాన్ సాధించిన విజయం అమోఘం. అతడు అంతకుముందు వరుసగా విఫలమవుతుండటంతో 2023 డిసెంబర్‌లో జాతీయ జట్టులో స్థానం కోల్పోయాడు. తర్వాత దేశీయ టోర్నీలలో సత్తా చాటాడు. ముఖ్యంగా ఝార్ఖండ్ తరఫున రంజీలలో ఆడి భారీ పరుగులు సాధించాడు. అనంతరం 2025-26లో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కూడా రాణించాడు. దీంతో తిరిగి జాతీయ జట్టులో అతడికి స్థానం దక్కింది. ఆ తర్వాత టీ20 వరల్డ్ కప్‌లో కూడా రాణించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. మరోవైపు ఇటీవల ఇండియాపై రెండు టీ20 మ్యాచుల్లో విజయం సాధించిన ఐర్లాండ్ ఆటగాళ్లు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లారు. ఐర్లాండ్ కెప్టెన్ లోర్కాన్ టక్కర్ 77వ ర్యాంకు సాధించాడు. రాస్ అడైర్ 84వ ర్యాంకు సాధించాడు.

# టీమిండియా మాజీ క్రికెటర్ కు భారీ ఉపశమనం..

### 3 ఏళ్ల నిషేధం ఎత్తివేత..!



అభిమానులకు, ముఖ్యంగా కేరళ స్పీడ్‌స్టర్ ఎస్. శ్రీశాంత్ మద్దతుదారులకు ఇది ఒక పెద్ద ఊరటనిచ్చే వార్త. గత కొంతకాలంగా వివాదాలు, నిషేధాలతో సతమతమవుతున్న ఈ సీనియర్ ఫాస్ట్ బౌలర్‌పై విధించిన మూడేళ్ల నిషేధాన్ని ఎత్తివేస్తూ కేరళ క్రికెట్ అసోసియేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయన మళ్లీ క్రికెట్ మైదానంలో చురుకైన పాత్ర పోషించేందుకు మార్గం సుగమమైంది.

క్షమాపణలు కోరిన శ్రీశాంత్.. కరిగిపోయిన బోర్డు..

గత ఏడాది కేరళ క్రికెట్ లీగ్ ప్రారంభానికి ముందు సోషల్ మీడియా, అలాగే విజువల్ మీడియాలో బోర్డుకు వ్యతిరేకంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు గానూ శ్రీశాంత్‌పై కేరళ క్రికెట్ అసోసియేషన్ మూడేళ్ల పాటు కఠిన నిషేధం విధించింది. ఈ చర్యతో శ్రీశాంత్ ప్రతిష్టకు, కెరీర్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆయన తిరువనంతపురం మున్సిఫ్ కోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ ఆయనకు ఎలాంటి ఊరట లభించలేదు. కోర్టు శ్రీశాంత్ పిటిషన్‌ను తిరస్కరించింది. అయితే, ఇటీవలి కాలంలో శ్రీశాంత్ తన తప్పును తెలుసుకుని, బోర్డు పట్ల తాను చేసిన వ్యాఖ్యలకు గానూ బేషరతుగా క్షమాపణలు కోరారు. తన ప్రవర్తనకు విచారం వ్యక్తం చేస్తూ బోర్డుకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో కేరళ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ప్రత్యేక జనరల్ బాడీ సమావేశంలో శ్రీశాంత్ క్షమాపణలపై సుదీర్ఘంగా చర్చించారు. శ్రీశాంత్ భారత క్రికెట్‌కు అందించిన సేవలను, అతని సుదీర్ఘ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని, బోర్డు పెద్దలు అతనిపై సానుకూలతను కనబరిచారు. చివరకు అతనిపై ఉన్న మూడేళ్ల నిషేధాన్ని పూర్తిగా తొలగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

# స్పోర్ట్స్

### 40 ఏళ్ల తర్వాత

## నాకౌట్‌లో విక్టరీ.

**-ఈక్వెడార్‌పై 2-0 గోల్స్ తేడాతో మెక్సికో విజయం**



**మెక్సికో సిటీ**

ఫిఫా వరల్డ్‌కప్ లో కోహోస్ట్ మెక్సిక్.. రౌండ్16లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈక్వెడార్‌తో జరిగిన రౌండ్ 32 మ్యాచ్‌లో.. 2-0 గోల్స్ తేడాతో మెక్సికో విజయం సాధించింది. నాకౌట్ దశలో దాదాపు 40 ఏళ్ల తర్వాత మెక్సికో విజయాన్ని నమోదు చేసింది. అయితే ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ తొలి అర్ధభాగంలో రావడం గమనార్హం. తొలుత 22వ నిమిషంలో జులియన్ క్వినోనిస్ , ఆ తర్వాత 9 నిమిషాల వ్యవధితో జిమినేజ్ మరో గోల్ కొట్టాడు. చివరిసారి 1986లో బల్గేరియాతో జరిగిన మ్యాచ్‌లో రౌండ్16 నాకౌట్ మ్యాచ్‌లో గెలిచిన తర్వాత మళ్లీ మెక్సికో ఈసారి విజయాన్ని నమోదు చేసింది. అయితే వరుసగా ఏడు సార్లు మెక్సికో నాకౌట్ దశలో ఓటమి పాలైంది. క్వినోనిస్ ఈ టోర్నీలో మూడో గోల్ చేశాడు.

# బ్రేకప్ రూమర్లకు కృతి సనన్ ఫుల్ స్టాప్ ..

## బాయ్‌ఫ్రెండ్ కబీర్‌తో ఫోటో వైరల్!




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ వ్యక్తిగత జీవితం మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. గత కొంతకాలంగా లండన్‌కు చెందిన వ్యాపారవేత్త కబీర్ బాహియాతో ఆమె ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఇటీవల వీరిద్దరూ విడిపోయారంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో కృతి చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ఆ రూమర్లకు చెక్ పెట్టిందా అనే చర్చ మొదలైంది. కృతి సనన్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ ఏడాది తొలి ఆరు నెలలకు సంబంధించిన ప్రత్యేక క్షణాలను 'హాఫ్ ఇయర్లీ డంప్' పేరుతో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫోటోలలో ఆమె కుటుంబ సభ్యులు, సోదరి నుపూర్ సనన్, పెంపుడు కుక్క, పర్యటనలకు సంబంధించిన చిత్రాలతో పాటు నటి రష్మిక మందన్నతో దిగిన ఫోటోలు కూడా ఉన్నాయి.అయితే అందరి దృష్టిని ఆకర్షించింది కబీర్ బాహియాతో ఉన్న ఒక ఫోటో. లైవ్ మ్యూజిక్ ఈవెంట్‌లో ఇద్దరూ కలిసి కనిపించిన ఈ ఫోటోలో ఒకరినొకరు ఆప్యాయంగా హత్తుకున్నట్లు కనిపించారు. దీంతో వీరిద్దరూ ఇప్పటికీ రిలేషన్‌లోనే ఉన్నారనే అభిప్రాయాలు సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం కబీర్ బాహియా మరో యువతితో కలిసి ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, కృతి--కబీర్ మధ్య బ్రేకప్ జరిగిందనే ప్రచారం మొదలైంది. అయితే జాతీయ మీడియా కథనాల ప్రకారం, కబీర్‌కు సన్నిహిత వర్గాలు ఆ ప్రచారాన్ని ఖండించాయి. వైరల్ అయిన ఫోటోలో కనిపించిన యువతి కబీర్ కుటుంబానికి అత్యంత సన్నిహితురాలని, ఆమెను ఆయన సోదరిలా భావిస్తారని పేర్కొన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియకుండా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందని వారు తెలిపినట్లు ఆ కథనాలు వెల్లడించాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కృతి సనన్ తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. తన సంబంధాలపై బహిరంగంగా చర్చించేందుకు ఆసక్తి లేదని, వివాహం జరిగే వరకు వ్యక్తిగత విషయాలను ప్రైవేట్‌గా ఉంచాలనుకుంటున్నానని ఆమె చెప్పారు. నాకు పెళ్లి అయిన తర్వాతే నా వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతాను. కొన్ని విషయాలు నాకు, నా కుటుంబానికే పరిమితం కావాలి అని ఆమె పేర్కొన్నారు. ఇక కెరీర్ విషయానికి వస్తే, కృతి సనన్ ప్రస్తుతం షాహిద్ కపూర్, రష్మిక మందన్నతో కలిసి నటించిన 'కాక్‌టెయిల్ 2' విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తూ ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. అయితే కృతి--కబీర్ రిలేషన్‌పై ఇప్పటికీ ఇద్దరి నుంచి అధికారిక ప్రకటన ఏదీ రాలేదు. దీంతో సోషల్ మీడియాలో వినిపిస్తున్న అనేక వార్తలు, విశ్లేషణలు కేవలం ప్రచారంగానే పరిగణించాల్సి ఉంటుంది. అయితే కృతి షేర్ చేసిన తాజా ఫోటో మాత్రం బ్రేకప్ రూమర్లపై మరోసారి చర్చకు దారితీసింది.



## మరింత అందంగా 'దృశ్యం' పాప..

# తేజ సజ్జ 'జాంబీ రెడ్డి 2'లో బాలీవుడ్ బ్యూటీ?

## టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైందా!




హనుమాన్,మిరాయ్ వంటి వరుస విజయాలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో తేజ సజ్జ ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. ఆయన కెరీర్‌లో తొలి రోజులలో మంచి విజయం సాధించిన 'జాంబీ రెడ్డి' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కనున్న జాంబీ రెడ్డి 2 పై ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాలీవుడ్ యువ నటి షనాయా కపూర్ ఈ చిత్రంలో కథానాయికగా నటించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'జాంబీ రెడ్డి 2'లో హీరోయిన్ పాత్ర కోసం షనాయా కపూర్‌తో చిత్రబృందం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అన్ని అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాతోనే ఆమె తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై చిత్ర నిర్మాణ సంస్థ లేదా షనాయా కపూర్ టీమ్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రస్తుతం ఈ వార్తను కేవలం ప్రచారంగానే పరిగణిస్తున్నారు. 2021లో విడుదలైన 'జాంబీ రెడ్డి' తెలుగు ప్రేక్షకులకు విభిన్నమైన జాంబీ థ్రిల్లర్ అనుభూతిని అందించింది. హారర్, కామెడీ, యాక్షన్ అంశాల మేళవింపుతో తెరకెక్కిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో సీక్వెల్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పుడు రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో రూపొందించేందుకు నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. 'జాంబీ రెడ్డి'కి దర్శకత్వం వహించిన ప్రశాంత్ వర్మ ఈ సీక్వెల్‌కు కథను అందించినట్లు సమాచారం. అయితే రెండో భాగానికి ఆయన దర్శకత్వం వహించరని, మరో దర్శకుడు ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీనిపై కూడా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం హీరోయిన్ ఎంపికతో పాటు చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# రోజూ వేధించేవారు, చివరకు రాయి విసిరా ..

## -స్కూల్ రోజుల్లో ఎదురైన చేదు అనుభవం ఇది...!

యువ నటి కయాదు లోహర్ తన స్కూల్ రోజుల్లో ఎదుర్కొన్న వేధింపుల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించిన విషయాలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. పదో తరగతి చదువుతున్న సమయంలో కొందరు యువకుల వేధింపులను ఎదుర్కొన్నానని, ఒక దశలో సహనం కోల్పోయి ఆవేశంతో రాయి విసిరిన సంఘటన ఇప్పటికీ గుర్తుందని ఆమె చెప్పుకొచ్చారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కయాదు లోహర్, తాను పదో తరగతి చదువుతున్న రోజుల్లో ఇంటికి సమీపంలో ఉన్న ట్యూషన్‌కు వెళ్లేదాన్నని తెలిపారు. ఆ మార్గంలో ప్రతిరోజూ కొందరు అబ్బాయిలు తనను వేధించేవారని చెప్పారు. మొదటి రోజు వాటిని పట్టించుకోలేదని, రెండో రోజు కూడా మౌనంగానే వెళ్లిపోయానని, కానీ మూడో రోజు మాత్రం పరిస్థితి భరించలేకపోయానని ఆమె గుర్తు చేసుకున్నారు.ఆ రోజు తీవ్ర కోపంతో రోడ్డుపై ఉన్న రాయిని తీసుకుని వారివైపు విసిరినట్లు కయాదు తెలిపారు. ఆ రాయి ఒక యువకుడి తలకు తగలడంతో అతడికి గాయమై రక్తస్రావం జరిగిందని చెప్పారు. ఆ ఘటన తర్వాత తాను అక్కడి నుంచి వెళ్లిపోయానని, తర్వాత ఏమైందో తనకు తెలియదని పేర్కొన్నారు. ఆ సమయంలో కోపం, భయం, నిస్సహాయత కలిసి తనను అలా స్పందించేలా చేశాయని వివరించారు. ఆ సంఘటనను ఇప్పుడు తిరిగి గుర్తు చేసుకుంటే, ఎవరినైనా గాయపరచడం సరైన పద్ధతి కాదని కయాదు అంగీకరించారు. హింస ఎప్పుడూ పరిష్కారం కాదని చెప్పిన ఆమె, అయితే అప్పటి పరిస్థితుల్లో తనకు ఎదురైన వేధింపులు, మానసిక ఒత్తిడి కారణంగానే అలా ప్రవర్తించాల్సి వచ్చిందని తెలిపారు. సాధారణంగా తాను ప్రశాంత స్వభావం కలిగిన వ్యక్తినని, కానీ ఎవరైనా తప్పు చేస్తే దానిని మౌనంగా భరించడం కూడా సరికాదని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కయాదు లోహర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహిళలు, విద్యార్థినులు విద్యాసంస్థలకు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఎదుర్కొనే వేధింపుల సమస్యపై మరోసారి చర్చ మొదలైంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు మరింత బలోపేతం కావాలని పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కయాదు లోహర్ పలు భాషల్లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఆమె నటించిన 'ఇధయమ్ మురళి' జూలై 10న విడుదల కానుండగా, 'ఇమ్మోర్టల్' జూలై 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే 'ఐ యామ్ గేమ్', 'ఖలీఫా', 'ది ప్యారడైజ్' వంటి చిత్రాలతో పాటు హీరో సూర్య నటిస్తున్న మరో చిత్రంలోనూ ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. న్నారు.

# తుదిదశలో 'ఫౌజీ'



అగ్ర హీరో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ వార్ డ్రామా 'ఫౌజీ'పై అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రేమ, దేశభక్తి, యుద్ధం మిళితమైన కథతో దర్శకుడు హను రాఘవపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో తిరుగుబాటుదారుడిగా మారిన బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారు. ఇమాన్వి కథానాయిక. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం నిర్మాణం తుది దశకు చేరుకున్నది. ఈ ఏడాది చివరిలో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ని కూడా విడుదల చేయనున్నారు. ఆ గ్లింప్స్ ద్వారా సినిమా రిలీజ్ డేట్‌ని ప్రకటించనున్నారు. యుద్ధ నేపథ్యంలో సాగే ఈ ఎమోషనల్ మూవీలో అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుందని, మునుపెన్నడూ చూడనటువంటి విభిన్నమైన పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని ఇన్‌సైడ్ టాక్. మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

# 'ఓజీ–2'లో నాయికగా?



అగ్ర కథానాయిక పూజాహెగ్డే కొంతకాలం పాటు తెలుగు సినిమాకు దూరంగా ఉంది. బాలీవుడ్‌పై దృష్టి పెట్టిన ఈ సొగసరి అక్కడ వరుస ఫ్లాపులు పలకరించడంతో మళ్లీ దక్షిణాది బాట పట్టింది. ప్రస్తుతం తెలుగు, తమిళంలో భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ అమ్మడు తొలిసారి పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్‌తో జోడీ కట్టబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే... బ్లాక్‌బస్టర్ మూవీ 'ఓజీ'కి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దర్శకుడు సుజీత్ ప్రస్తుతం సినిమా ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు.మరోవైపు కథానాయిక అన్వేషణలో కూడా చిత్రబృందం ఉన్నట్లు తెలిసింది. ఈ రేసులో పూజాహెగ్డే పేరు ప్రముఖంగా వినిపిస్తున్నదని, ఆమెనే ఖరారు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నది ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం పూజాహెగ్డే తెలుగులో దుల్కర్ సల్మాన్ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో కూడా ఆమెనే కథానాయికగా ఖరారయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com